UNIVERSAL
LIBRARY
OU_204154
UNIVERSAL
LIBRARY

# STORIES

OF

# PALNAD HEROES

IN TELUGU

BY

**AKKIRAJU UMAKANTAM, VIDYASHEKHAR**

***Pandit, Presidency College, Madras.***

## పల్నాటి వీరుల కథలు.

Post Graduate Library
College of Arts & Commerce. O. U.

SECOND EDITION REVISED

MACMILLAN & CO., LIMITED
MADRAS. BOMBAY, CALCUTTA AND LONDON

1921

# పల్నాటి వీరుల కథలు


బ్రహ్మశ్రీ

విద్యాశేఖర

అక్కిరాజు ఉమాకాంతం పంతులుగారు,

పండితులు, ప్రెసిడెన్సీ కాలేజి, మద్రాసు.



Post Graduate Library
College of Arts & Commerce, O. U.


రెండవ కూర్పు.


మాక్మిలన్ కంపెనివారు,

మదరాసు, బొంబాయి, కలకత్తా, లండన్.

1921

*Copyright*
TRANSFERRED TO MACMILLAN & CO. LTD.
1921
SECOND EDITION
REVISED

పితృపాదులకు సమర్పితము.

# పల్నాటి వీరుల కథలు

శ్రీ గురుభ్యో నమః.

శ్లో॥ నమామి వాఙ్మయీం దేవీమ్ । దేవం వాణీమనోహరమ్
వీరాంశ్చ కవితాధీనాన్ । ధీరాన్ రసవిమోహితాన్.

శ్లో॥ కృష్ణాపినాకినీగోదా । తుఙ్గభద్రాప్రయుక్శుభామ్
త్రిలిఙ్గజననీం వన్దే । త్రికోటిజనశోభితామ్.

శ్లో॥ త్రైలిఙ్గేషు త్రయసదిశి శ్రీగిరేర్వీరభూమిః
పల్నాడిత్యస్త్యురగతటినీ చన్ద్రభాగాపవిత్రా
విశ్వామిత్రో నృపసుతయుతో యత్ర యజ్ఞం వ్యధాసీత్
యత్రాసీచ్చ త్రిపురసమధికః సిద్ధనాగార్జునార్యః.

శ్లో॥ పిఙ్గళస్కన్దరాజశ్చ । కాకునూరిస్తథాపరః
తస్యాంపల్నాటి సీమాయాం । ప్రాదుర్భావమలప్సత.

శ్లో॥ తత్రాస్తే గుత్తికొణ్డాఖ్యో । గ్రామో వేమనగాన్తికే
పుణ్యక్షేత్రే యశోయస్య । సర్వదిక్షు ప్రపఞ్చితమ్.

శ్లో॥ ముని ప్రగ్గడ సంశ్రయః । అక్క-రాజాహ్వయః పురా
కేనాపి హేతునా గ్రామం । గుత్తికొణ్డం సమాయయౌ.

శ్లో॥ తస్మాత్ కాలాత్ ప్రభృతి కృతినోఽస్యాక్క-రాజస్య వంశః
త్యక్త్వా మునిప్రగడమగమత్ పౌరుషం నామధేయమ్
ఖ్యాతం లోకే మమకులమభూ దక్క-రాజేన నామ్నా
యస్మిన్ జాతాః శ్రుతిపథరతా మానినః శుద్ధశీలాః.

శ్లో॥ ఏతేషా మక్రి-రాజానాం । నాలజ్యా యశగోత్రజామ్
ఋషిర్గాధితనూజాతో । ఇతీయం మహతీ ప్రథా.

[మూర్తిః

శ్లో॥ తేష్వాసీదక్రి-గాజే ష్వాకలుషితమనాః సుష్ఠు సత్యై

[ఘాఢః

లక్ష్మీనారాయణాఖ్యో గురుజనమహిమ ప్రాప్తతేజా ద్రు

[తాం ప్రాప్నుహీతి

ప్రాదాత్ బాల్యేఽపి యస్మై పరమతులమహో! సిద్ధ

[తీర్థః.

నిత్యానన్దావధూతః కనుపరితికులః పూజ్యపాదోయ

శ్లో॥ యతేస్తస్య ప్రసాదేన । కృత్వా తపసికామనామ్
లక్ష్మీనారాయణో బాలః । శ్రీశైల మగమత్ కృతీ.

శ్లో॥ తత్రారణ్యే తపస్తప్త్వా । ద్వాదశాబ్దానచఞ్చలః
దదర్శ స మహాదేవీం । శ్రీశైలభ్రమరామ్బికామ్.

శ్లో॥ నకిఞ్చి దీప్సితం దేవి! । వినా తే పాదసేవనమ్
ఇతి ప్రోవాచ తారుణ్యా । స్ఫుటకణ్ఠేన తాపసః.

శ్లో॥ కఞ్చిత్కాలం గృహస్థస్త్వా । మస్మిపుత్ర! తనప్రేణు
తురీయమాశ్రమం లబ్ధ్వా । శ్రేయః పరమవాప్స్యసి.

శ్లో॥ గచ్ఛ! గచ్ఛ! గృహం పుత్ర! । వివాహస్తే భవిష్యతి
ఏవముక్త్వా క్షణా ద్దేవీ । భ్రమరామ్బాతిరోదధే.

శ్లో॥ దేవీ వాక్యానుసారేణ । గృహంగత్వాఽభవత్ గృహీ
తతోభిక్షు త్వమాశ్రిత్య । సిద్ధిమాప స సంయమీ.

శ్లో॥ బుచ్చయ్య స్తుజ్జతుర్థీయః । నృసింహః కొప్పరాట్ కులః
యోగినౌచ మహాత్మానౌ । మిత్రే తస్య బభూవతుః.

శ్లో॥ మునిభిస్సేవితే పుణ్యే । గుచ్ఛాచలబిలే వసన్
అన్త్యకాలే సమాహూయ । శిష్యాన్ పాదోపసేవినః.

శ్లో॥ మతిమేకం సముద్ధర్తుం । కురుజాఙ్గలనామకే
దేశేఽహం సంభవిష్యామి । లప్స్యే ముక్తం తతఃపరమ్.

శ్లో॥ ఏవముక్త్వా మహాతేజాః । ధ్యానే పరమపావనః
లక్ష్మీనారాయణః సిద్ధః । శరీర మజహా న్మునిః.

శ్లో॥ దేవీవరపవిత్రస్య । తస్య పూర్వాశ్రమే యతేః
త్రయఃపుత్రా అజాయన్త । సద్ధర్మమార్గానుయాయినః.

శ్లో॥ ఆద్యఃపుత్ర ఉమాకాన్తః । నిత్యానన్దో ద్వితీయకః
తృతీయోవ్యాస ఏతేషు । ప్రథమా ద్వ్యాసపుత్రకౌ.

శ్లో॥ పిజ్జలీయా సదాచారా । మహీతుల్యా క్షమాగుణే
అన్నదాసరతా లక్ష్మీః । భార్యాభూత్ వ్యాసమన్త్రిణః.

శ్లో॥ ఆహితాగ్ని శ్శుచి ర్ధన్యః । ఋక్శాఖీయః ప్రతాపవాన్
విశ్వామిత్రక్రమో వ్యాసః । లేభే స చతురస్సుతాన్.

శ్లో॥ ఆద్యోమృత్యుఞ్జయఃఖ్యాతః । ద్వితీయః శ్రీశుకోఽభవత్
నిత్యానన్ద స్తృతీయోఽన్త్యః । లక్ష్మీనారాయణాహ్వయః.

శ్లో॥ తనూజా నామభావేన । మహాసత్త్వోఽన్నతాకృతిః
అపాలయదుమాకాన్తః । లక్ష్మీనారాయణం శిశుమ్.

శ్లో॥ కొప్పరాణ్నరసింహస్య । పౌత్రీ లక్ష్మీ గుణోత్తరా
లక్ష్మీ నారాయణార్యస్య । బభూవ సహధర్మిణీ.

శ్లో॥ తయోర్ద్వౌ సోదరమ్పుత్రౌ । శిష్టాచారవతోస్సతోః
వృత్తింపునాతు మాం నిత్యమ్ । పద్మయాస్సత్యశీలయో

శ్లో॥ లక్ష్మీ నారాయణాఖ్యస్య । శ్రుతిమార్గానుయాయినః
సత్యశీలస్య పుత్రోఽహమ్ । ఉమాకాన్త ఇతీరితః.

శ్లో॥ కృతిః పల్నాటివీరాణాం । కథాభిః శోభితాకృతిః
నిర్మాయ పితృపాదేభ్యః । మయేదానీం సమర్ప్యతే.

శ్లో॥ యావద్వసన్తి తాం పృథ్వీం । యావత్తైలిఙ్గ నాట్యయమ్
యావచ్చ పఠనం లోకే । తావదాస్తామియం కృతిః.

# పూర్వపీఠిక

ఉత్తరదేశమునఁ బాలమాచాపురియను పట్టణముకలదు. జంభనాపురియని దీనికి నామాంతరము. దీని ననుగురాజేలుచుండెను. ఇతండు కార్తవీర్యార్జునున కేడవతరమువాఁడు. కార్తవీర్యుండు చేసినపాపములు బాధింపఁగా ననుగురాజు బ్రాహ్మణోత్తముల యాలోచనవలన జీడిమానెగుడ్డలు ధరించి సస్త్రీకుండు, సామాత్యుండు, సధనుండు, సకలదేవుండున్నై రాజ్యము విడిచి పాపపరిహారార్థము తీర్థయాత్రలకువెడలి నానాక్షేత్రంబుల సేవించుచు నదులలో మునుఁగుచు నీ దేశమునకువచ్చి యమరావతి కేఁగి కృష్ణానదిలో స్నానముచేయఁగా నల్లని జీడిమానెగుడ్డలు తెల్లనాయెను. ఇట్లు వస్త్రములు తెల్లనగుటయే పాపవిమోచనమునకుఁ జిహ్నమని బ్రాహ్మణులనుగురాజునకుఁ బూర్వమునఁ జెప్పియుండిరి. అనుగురాజప్పుడు చండవోలులో రాజ్యముజేయుచున్న రాజుకూఁతును వివాహమాడెను. ఆమె పేరు మైలాంబ. కూఁతునకుఁ జండవోలురాజు పల్నాడరణమిచ్చినందున ననుగురాజు గురిజాల రాజధానిగ పల్నాటి కధిపతియయ్యెను. అనుగురాజునకు భార్యలుముగ్గురు. వీరవిద్యాదేవి, భూరమాదేవి, మైలమాదేవి. వీరవిద్యాదేవియందుఁ బెదమల్లదేవుఁడు, పినమల్లదేవుఁడు, బాలమల్లదేవుఁడు ననుముగ్గురు పుత్రులు గలిగిరి. భూరమాదేవియందు కామరాజు,

నరసింహభూపతి, ఝట్టిరాజు, పెరుమాళ్లురాజునను నల్వురు సుతు లుద్భవించిరి. అనుగురాజుమంత్రి దొడ్డనాయఁడు. ఇతఁడు వెలమ; జేతినాయని కుమారుఁడు. దొడ్డనాయని కొడుకులు బాదరాజు, బ్రహ్మనాయఁడు. బాదరాజునకుఁ బెద్దన్నయని నామాంతరముకలదు. సంతానము కలుగకముం దనుగురాజుచే బాదరాజు పెంచుకొనఁబడి క్షత్రియుండును గంచర్లపురాధీశుఁడునైన కృష్ణగంధర్వుని కూతును లవాంబను బెండ్లాడెను. బ్రహ్మనాయఁడు విష్ణువుగా భావింపఁబడుచున్నాఁడు. కురుక్షేత్రయుద్ధమునఁ గృష్ణుఁడెంత ముఖ్యుఁడుగా నుండెనో పల్నాటియుద్ధమున బ్రహ్మనాయఁడంతె ముఖ్యుఁడుగా నుండెను. ఈయన పల్నాటి కృష్ణుఁడని పేర్కొనఁబడుచున్నాఁడు. ఇతని కుమారుఁడు బాలచంద్రుఁడు. కన్నమదాసని మఱియొకఁడు గలఁడు.

ఇట్లు దొడ్డనాయఁడు మంత్రిగ ననుగురాజు కొంతకాలము పరిపాలించి మృతినొందెను. దొడ్డనాయఁడుకూడ స్వర్గమున కేగెను. నలగామరాజు పట్టాభిషిక్తుఁడాయెను. నాయకురాలను నొకయువతి నిజశక్తిచేత ననుగురాజు ననుగ్రహము సంపాదించి యతఁడు చనిపోయిన వెనుక నలగామరాజువద్ద మంత్రిణియయ్యెను. ఈనాయకురాలి యసలుపేరు నాగాంబ. నాయకురాలనియే సాధారణముగా వ్యవహరింపఁబడుచున్నది.

"నాయకురాలి జన్మస్థలము పల్నాడుతాలూకాలో నాగులేటియొడ్డుననున్న జిట్టగామాలపాడను నొక చిన్నగ్రామము. ఈమెపంట రెడ్లకులమునఁబుట్టినది. తండ్రిపేరు చౌదరిరామిరెడ్డి.

మేనమామపేరు మేకపోతు సింగారెడ్డి. ఈమెయింటిపేర రవల్లి
వారని చెప్పఁబడినది. ఇది తల్లిగారింటిపేరో యత్తగారింటిపేరో
తెలియదు. ఈమెభర్త నామమెచ్చటఁ గానరాదు. పల్నాటి
యుద్ధమున కీమెయే కారకురాలు. అతి పరాక్రమశాలిని. గుం
జాల పురవరాధీశ్వరులగు నలగామరాజాదు లీమెచేతిలో కీలు
బొమ్మలవలె నుండువారు. ఈమె బ్రహ్మనాయని కిరుపోటిగా
రాజ్యతంత్రము నడపిన మహాసమర్థురాలు. యుద్ధావసానము
వరకుఁజలనమునొందక మగ బిరుదుకట్టి యశ్వారూఢయై బ్రహ్మ
నాయనితోఁబోరసమకట్టిన నిరుపమానశూరురాలు........
ఈమె మంత్రిణి యగునప్పటికి వీరవిద్యాదేవికి జన్మించిన మల్ల
దేవాదులు బాలురుగానుండిరి. బ్రహ్మనాయఁడు వీరిని దగ్గఱకుఁ
దీసి రాజ్యములోఁ గొంతిభాగమిప్పించి [1]గురిజాలనుండి పోయి
[2]మాచెర్లపట్టణము నిర్మించుకొని వారు యుక్తవయస్కులు కానం
దున వారికి బదులుగఁ దానే పరిపాలించుచుండెను. వారు
పెద్దవారైన తరువాతఁ గల్యాణ పట్టణాధీశుఁడైన వీరసోముని
కుమార్తెలనిప్పించి వివాహముచేసి పెదమల్లదేవుని మాచెర్ల
కుఁబట్టాభిషిక్తునిఁ జేసెను. అనుగురాజు చనిపోవునపుడు కొడు
కుల నందఱను బ్రహ్మనాయనికి ఒప్పగించెను. నలగామరాజు
నాయకురాలిని మంత్రిణిగాఁ జేసికొన్నను మల్లదేవులకుఁ బెండ్లి
చేసిన తరువాత బ్రహ్మనాయఁడు ద్వేషబుద్ధిలేక నలగామరాజు

---

[1] పల్నాటిసీమలో ఉన్నది.

[2] పల్నాటిసీమలో చంద్రవంక నదిమీద ఉన్నది. పల్నాడు గుంటూరుజిల్లాలో ఒక సీమ.

నకు భూరమాదేవి పుత్రులకుఁ గట్నములిచ్చుటకై గురిజాల కుఁబోయెను. వారును దగినవిధముల గౌరవించిరి. గురిజాలలో బ్రహ్మనాయనికి నాయకురాలు విషముపెట్టించెనుగాని యామె ప్రయత్నము నిష్ఫలమాయెను. మాయచేసి నాయకురాలతనినిఁ గోడిపందెమున కొడఁబఱచెను. ఓడిపోయినవారేడుసంవత్సరములు రాజ్యమువిడిచిపెట్టి పరభూములకుఁ బోవలయునని పందెపుటొడంబడిక. పందెములో బ్రహ్మనాయఁడోడి గోపన్నను గోల్పోయి మల్లదేవుల వెంటఁబెట్టికొని మాచెర్లవిడిచి కృష్ణానదినిదాఁటి మండాదిపట్టణమునకు వలసపోయెను."

దీనిని శ్రీనాథుని పల్నాటివీరచరిత్ర ఉపోద్ఘాతమునుండి యెత్తివ్రాసితిని. ఇక్కడనుండి కథ యీగ్రంథములో ఉన్నది.

# మండాదివలస


గురిజాలకోడిపోరులో బ్రహ్మనాయుఁడు ఓడిపోయెను. పందెము ప్రకారము ఓడినవారు ఏడేండ్లు మండాదిఅడవులకు వలస పోవలయును. బ్రహ్మనాయుఁడు మలిదేవరాజునకు ఈసంగతి తెల్పెను; మాచెర్లకాపులకు, కరణాలకు తెల్పెను. కాపులు "స్వామీ మలిదేవరాజుపాలనక్రింద అన్ని సౌఖ్యములను, అనుభవించుచున్నాము. నలగామ రాజుమంత్రిణికి నాయకురాలికి, మమ్ము మీరు ఒప్పగించి పోఁ దలఁచినారు. పాలుపంపులలో, పంటలలో, పన్నులలో, కోలతూములలో, ఆమె మమ్మును బాధించును. మేమిక్కడ ఉండలేము. మీవెంట అడవులకు వత్తుము. అడవుల నయినా దున్నఁగలము గాని నాయకురాలి చేతిక్రింద ఉండలేము" అని విన్నవించిరి.

"కరారుతప్పి బ్రహ్మనాయుఁడు కాపులను వెంటఁదీసికొని ఊరు పాడుపెట్టెనని శత్రువులాడుదురు. కనుక మీరు మాచెర్లలోనే ఉండవలసినది" అని బ్రహ్మనాయుఁడు పలికెను. కాని ప్రజలు వినలేదు. వెంటవచ్చుటకు బ్రహ్మనాయుఁడు ఒప్పుకొనెను. బయలు దేరవలసినదని ఊరిలో సాటించిరి.

వీరులను వెంటఁబెట్టుకొని బ్రహ్మనాయుఁడు చెన్నకేశవుని గుడికి పోయెను. స్వామి ఆభరణములుతీసి పెట్టెలో పెట్టిరి. చెన్నునికి చివర మ్రొక్కు మ్రొక్కిరి; తక్కిన దేవతలకు మ్రొక్కిరి; భైరవునకు భుక్తిబెట్టిరి; తిరిగి యిండ్లకువచ్చిరి; సరు

కులు బండ్లకెత్తినారు; అందలాలు, గుడారాలు, పల్లకీలు సిద్ధపఱచినారు. మాచెర్లనుండి బయలుదేరవలసిన ఆదివారము వచ్చినది. వీరమాతలు, వీరభార్యలు, రాణులు, అందలాలలో ఎక్కిరి. వీరులు, రాజులు గుఱ్ఱములెక్కిరి. సైన్యముకదలినది. పశువులు కదలినవి. గండికోటఁదాటిరి. నాగార్జునకొండదగ్గరకు వచ్చిరి.

అక్కడి మంత్రవాదుల మహిమలు, పులుల భయంకరమైన కథలు బ్రహ్మనాయనికి జనులు విన్నవించిరి. చుక్కలగుండము దాఁటి, కన్నులకుంటదాఁటి పెందోటకు వచ్చిరి. ఈ అడవి యెట్లు దాటుదుమో అని జనులందఱూ గజగజవణకుచు ప్రయాణము చేయుచుండిరి. పెద్దపులి ఆ గుంపులోనికి రానేవచ్చినది. కలవరము హెచ్చెను. ఎద్దులు, ఆవులు, బెదరి చెల్లాచెదరాయెను. నలగామరాజుమనుష్యులు వచ్చినారని బ్రహ్మనాయఁడు అనుకొనెను. చివరకు పులి అని స్పష్టపడినది. లంకన్న, గండుకన్నమనీడు, పులిమీఁదఁబడి చంపిరి. చివరకు ఏలేశ్వరము వద్దకువచ్చిరి. ఏలేశ్వరమువద్ద కృష్ణానదినిదాఁటి వారు వలస అడవులకు పోవలెను. రాణులు, దాసదాసీజనము, పుట్లెక్కి కృష్ణదాఁటిరి. సైన్యముదాఁటెను. పశువులు ఈది అద్దరిచేరినవి. రాజు లెక్కినపుట్లు బయలుదేఱినవి. మొసలి ఒకటి యెదురుగావచ్చెను. మంటలు గ్రుక్కుగ్రుడ్లు, మొగలిపువ్వువంటి ముక్కుచాయ, మిసిమి వాడికోరలు, ఒడ్డురాళ్ల వంటి ఒడలి చిప్పలు, అది ఎంతో భయంకరముగా ఉన్నది. నాయకురాలి కుట్రచే మంత్రవాదులు చేసిన పంపు అని వారు అనుకొనిరి. వీరులు దానిని పొడిచిరి. అది నదినంతా అల్లకల్లోలము చేయుచు మలిదేవరాజు పుట్టిమీఁదికి పోవుచున్నది.



విలేశ్వరంపు రేవు మొసలితో బ్రహ్మనాయని పోరాటము.

బ్రహ్మనాయఁడు ఉగ్రుఁడై మొసలికి అడ్డముపోయెను; సుడిగుండము లన్నిటిలో దానిని త్రిప్పులఁబెట్టెను. రాజుల ఫుట్లు దరికి చేరినవి. బ్రహ్మన్న మొసలితో పోరాడుచున్నాఁడు.

మొసలికి జవము తగ్గలేదు. బ్రహ్మనాయఁడు నీటిలోమునిఁగి కొంతసేపుండెను. మొసలిదెబ్బలకు చచ్చి బ్రహ్మనాయఁడు నీట మునిఁగెనని రాజులు, దొరలు, వీరులు దుఃఖపడిరి. బ్రహ్మనాయని శరీరమును వెతకి తీసికొనిరమ్మని బెస్తలను పంపిరి. వారు మునిఁగి అంతటాచూచిరి. ఎక్కడను బ్రహ్మనాయని శరీరము కానరాలేదు. ఆశలు వదలుకొనిపోయిరి; రాజులకు విన్నవించిరి. వారి దుఃఖము అధికమైనది. బ్రహ్మనాయని తల్లి శీలమ్మ, రాజుల వద్దకు వచ్చెను.

"మీరు ఎంతమాత్రమును చింతపడవద్దు. చుక్కలు రాలితే, సూర్యుడు పడమటపొడిచితే, సముద్రములింకితే, బ్రహ్మనాయఁడు చచ్చెనని అనుకొనవలసినది. బ్రహ్మనాయఁడు మొసలిచేత చచ్చెడు వాఁడుకాఁడు. నాకుమారుని మనుష్యుఁడు చంపలేఁడు. మృగముచంపలేదు. జాతకమును చూచినను బ్రహ్మనకు ఇప్పుడు చావులేదు. నాకుమారుఁడు వీరుఁడు మొసలిని చంపునుగాని మొసలి నాకుమారుని చంపదు" అని శీలమ్మ రాజులకు చెప్పినది.

ఇంతలో బ్రహ్మనాయఁడు నీటిపైకి వచ్చెను. మొసలిదవడలను కాలితోతన్నినాఁడు. కాళ్లను నడుమును నరికినాఁడు. ప్రవాహము ఎఱ్ఱబడెను. జలమును క్షోభపఱచి మొసలిప్రాణములు విడిచినది. బ్రహ్మనాయఁడు పోయి ఒక గుంటిమీద [illegible]ను. అప్పటినుండి అది నాయనిగుండు అని ప్రసిద్ధికెక్కినది.

దొరలు, వీరులు, జనులు సంతోషించిరి. కొల్వుచేసి

సభలో బ్రహ్మనాయని మలిదేవరాజు గౌరవించెను. నాయని గౌరవముకొరకు బ్రాహ్మణులకు వస్త్రములు, శాలువలు ఇచ్చిరి. బ్రహ్మనాయనికి ఆభరణములు సమర్పించిరి. మరల బయలు దేరి అందఱును మండాదికానలకుచేరి అచ్చట విడిసిరి. మేడలు, ఇండ్లు కట్టిరి. రాజుల కొల్వుకూటములు తీరినవి దొరల మొగసాలలు ముగిసినవి. గోపురములు లేచినవి. వీథు లేర్పడ్డవి. అంగళ్లు వెలసినవి. మండాది ఒక పెద్దపట్టణమాయెను. వీరిక్కడ ఏడేండ్లు వలసకాలము గడుపవలసియున్నది.

కోడిపోరున భూమి గోల్పోయి ఓడి । ఓడిన మాచర్ల వలసలుగట్టి
పండిన పల్నాటి పంటలు విడిచి । నిండిన మాచెర్ల నిధులను విడిచి
మలిదేవరాజును మన్నె నాయకులు । మండాది కానల మూగియున్నారు

అని శ్రీమదక్కిరాజు లక్ష్మీనారాయణపుత్రి......ఉమాకాన్త విద్యాశేఖర ప్రణీతమైన పల్నాటివీరుల కథలలో మండాది వలస సమాప్తము.

# మందపోటు

కాపులు భూములను సాగుచేసిరి. పంటలో పదవభాగము రాజున కిచ్చుచుండిరి. బ్రహ్మనాయుడు రాజ్యతంత్రము నడపుచుండెను. ఇక గురిజాల వృత్తాంతము. గురిజాలలో నలగామరాజు కొల్వుతీరెను. నరసింహభూపతి, నాయకురాలు, కొ... కూటమునకు వచ్చిరి. వీరులు, మన్నీలు పన్నెండిండ్ల వ...

కులు వచ్చిరి. పరదేశరాజులంపఁగా కాన్కలుతెచ్చిన రాయబారులు మొగసాలలో ఉన్నారు. వారిని నలగాముఁడు లోనికి రా అనుజ్ఞయిచ్చెను; కాన్కలు తీసికొని వారిని గౌరవించెను. కొల్వుకూటమున ఉన్నవారిందఱును వినుచుండఁగా నాయకురాలు లేచి "ప్రభూ నామనవి వినవలసినది. బ్రహ్మనాయని దుర్నీతి మీరు తెలిసికొనియే యుందురు. పందెపు నీతితప్పి కాపులను వెంటగొనిపోయినాఁడు. పాడుబెట్టిన ఊళ్లను మనకు వదలిపెట్టినాఁడు. జనములేని పాడుబడ్డ రాజ్యమును మనమేమి చేసికొందుము? మనము బ్రహ్మనాయని ఊరక వదలిపెట్టుట నీతి కాదు. పంతము దప్పిన బ్రహ్మనాయనిపట్టి తెప్పించవలెను. వారిని చీకాకుపఱచవలెను. వారు మనకునష్టముచేసినట్లు వారికి మనము నష్టముచేయవలెను" అని చెప్పినది.

నాయకురాలి మాటలకు నలగామరాజు సమ్మతించెను. నాయకురాలు ఒక బ్రాహ్మణుని పిలిచినది. "నీవు మండాదికి పోవలెను. ఆ పట్టణము, అచ్చటి ఆవులమంద, ఏ తీరున ఉన్నది చూచివచ్చి మాకు తెలుపవలెను. నీకు అగ్రహారమిచ్చెదము" అని ఆ బ్రాహ్మణునితో అన్నది. బ్రాహ్మణునికి తాంబూలమిచ్చినది. అతఁడు మండాదికి బయలుదేరెను. కోట గవనులు దాఁటి, శేవంతుని బైలుదాఁటి, కోడిపోరుగుట్టలుదాఁటి, కంభము పాడుదాఁటి, నాగార్జునకొండదాఁటి, బ్రాహ్మణుఁడు ఏలేశ్వరపు రేవుచేరెను. అద్దరికి పోయి స్నానము చేసినాఁడు. మొగమున అక్షతలు పెట్టినాఁడు. నీరుకావిధోవతి కట్టినాఁడు. గొడుగు పట్టినాఁడు. తిన్నగా మండాది ప్రవేశించెను. పంచాంగము చెప్పువానివలె నటించుచు అతఁడు రాచనగరికి పోయెను. వాడ

వాడలు తిరిగెను. మండాది అంతా కలయఁజూచెను. మండాది వదలి అతఁడు పశువులమంద దగ్గరకు పోయెను. మందలకు నాయకుఁడు లంకన్న. బ్రాహ్మణునికి కొన్ని ఆవులను లంకన్న దానమిచ్చెను. బ్రాహ్మణుఁడు అంతటితో తృప్తిపడలేదు. "కొండెములకోరివి, కపటాలపెట్టి, జిట్టగామాలపాటిజెట్టి, నాయకురాలు మా అగ్రహారాలు తీసికొన్నది. బ్రహ్మనాయఁడు పల్నాటిని వదలినది మొదలు నాయకురాలు బ్రాహ్మణులను బాధలు పెట్టుచున్నది. మమ్మును కడగండ్లపాలు చేసినది. కనుక నీ కడకు వచ్చితిని" అని బ్రాహ్మణుఁడు చెప్పెను. లంకన్న నమ్మెను: ఇన్నూరు మాడలిచ్చెను. బ్రాహ్మణుడంతట బయలుదేరెను. భీముని కురవదాఁటి, ఏలేశ్వరమునద్ద కృష్ణదాఁటి, అతఁడు తిరిగి గురజాలచేరెను.

నలగామరాజు కొలువుతీర్చి కూర్చున్నాఁడు. బ్రాహ్మణుఁడు వచ్చెను. "ఓహోహో మండాదివైభవము! ఆకోటలు, ఆపేటలు, ఆ రాచవీధులు ఏమనిచెప్పుదును? ప్రజలు అచ్చట సర్వసౌఖ్యములు అనుభవించుచున్నారు. మాచెర్లను కలలోనైనను తలపెట్టరు. పల్నాడు విడుచుట వారికి భాగ్యమే అయినది. అచ్చటివీరులు పులులనైనను, సింహములనైనను సాధింతురు. వారిపశువుల మందలోనికిపోతే ఆఁకలిదప్పులుపాయును. దూడలు, కోడెలు, ఆవులు కన్నులపండగగా ఉన్నవి. చుక్కలను లెక్కపెట్టవచ్చును గాని ఆ పశువులను లెక్కపెట్టలేము" అని అతఁడు మండాది సంపదను పొగడెను. తరువాత నాయకురాలులేచి "స్వామీ! నా విన్నపమాలకింపవలసినది. బ్రహ్మనాయఁడు పంతముదప్పి రాజ్యము పాడుపెట్టిపోయినందుకు కసితీర్చుకొనవలెనని నేను ఇదివరకు చెప్పినమాటను అంగీక

రించితిరి. బ్రహ్మనాయని పట్టితెప్పించవలెను. దానికి ఉపాయము చెప్పుచున్నాను. మలిదేవుని ఆవులమందను పొడిపించవలెను. వారికి తీరని నష్టము కలుగును. పిమ్మట వారిని మండాదినుంచి తరిమివేయవచ్చును. మరల మాచెర్లను తల పెట్టకుండా పారిపోవుదురు. పోరులు సమసిపోవును. మనము సుఖముగా రాజ్యమేలవచ్చును" అని చెప్పినది.

ఆ సభలో చింతపల్లిరెడ్డి, ఛావరి అనువారు గలరు. వీరిద్దఱును రాచకార్యములలో సలహాలిచ్చుచుందురు. నాయకురాలి మాటలకు ఛావరి ఒప్పుకొనెను. చింతపల్లిరెడ్డి సమ్మతింపలేదు. "వారు భూమిని కోడిపోరులో కోల్పోయిరి. ఇది మనకు తగవుమాలిన గెలుపు. అయినప్పటికిని బ్రహ్మనాయుడు ఒడబాటు తప్పక పరభూమికి పోయెను. దేవరసీమ గుత్తకు తీసికొని అక్కడ ఉన్నాడు. వలదన్నను సత్తుమని కాపులు వెంబడించినందున, బ్రహ్మనాయుడు వారిని తీసికొని పోయెనుగాని అతని దోషము ఏమీలేదు. రాజ్యము పాడుచెట్టవలెనను దుర్బుద్ధి అతనికి ఏమాత్రమును లేదు. బ్రహ్మనాయునికి మనమీదనే కసి ఉండవలయునుగాని అతనిమీద మనకు ఉండుటకు ఏమీ కారణము లేదు. వారితో కలహము పెట్టుకొని గెలుచుట కష్టము. ఆడవారిమాటలకేమిగాని యుద్ధము సంభవించినయెడల బ్రహ్మనాయనికి సమానమైనవాడు మనలో ఎవరున్నారు? ఆకొన్నపులికోర అణచెడు వాడు, శేషుని కోరకు చెయిచాచు వాడు, బ్రహ్మరాక్షసినైనా పడగొట్టు వాడు బ్రహ్మనాయుడు. అతనిని కదలించుట ఆటలాడుటగాదు" అని చింతపల్లిరెడ్డి నాయకురాలిమాటలను కాదనెను. నాయకురాలికి కోపమువచ్చినది. "స్వామీ వింటిరా ఈతని విపరీతములు.

ఇతఁడు పగవారిపక్షమున చేరినాఁడు. పగవానిని భట్టువలెపొగడి నాఁడు. పాములతో చెలిమి పాటింపవచ్చునుగాని ఇట్టివానితో భాషింపరాదు. మన వీరులు గండరగండలు. ఒక బంటులా వెంత! ఒకని ఆయువెంత! ఒకని సాహసమెంత! ఇతఁడిట్లు పక్షపాతము చేసి పల్కుచున్నాఁడుగాని!" అని రాజుతో నాయకురాలన్నది. చింతపల్లిరెడ్డి తిరిగి తన వాదమును సమర్థించుకొనెను; బ్రహ్మనాయని శక్తిని పొగడెను. "స్వామీ! ఇతని మాటలు నాచెవులకు సూదులుగా ఉన్నవి. మీకు విని మనసయ్యె కాఁబోలు. ఇట్టి కొల్వుకూటములో ఇఁక నేను ఉండలేను. నేనుగాకున్న నావంటి వారెందఱో మీకు మంత్రులగుదురు. కడుపులోపలి చిచ్చు; కంటిలో నెరసు; నడిదలకెక్కిన విషము; నట్టింటి నాగుబాము; ఈస్వామి ద్రోహి ఉన్నచోట ఉండుట ఉచితముకాదు. ఓరాజా నన్ను పంపవలసినది" అని నాయకురాలు పలికినది. చింతపల్లి రెడ్డిమీఁద నలగామరాజునకు కోపమువచ్చినది. చింతపల్లి రెడ్డిని కొల్వులోనుండి వెళ్లఁగొట్టించెను. గురిజాలరాజ్యము వదలిపోవలసినదని రెడ్డికి ఆజ్ఞయిచ్చెను.

చింతపల్లిరెడ్డి తనబలగమును వెంటఁబెట్టుకొని పరిభూములకు బయలుదేఱినాఁడు. మాడుగులవద్ద విడిసినాఁడు. చింతపల్లిరెడ్డి పోఁగానే నలగామరాజు కొలువు చిన్నఁబోయినది. చందవోలి చండినాయకుఁడు, చిట్టాలపోలి నాయకుఁడు లేచి "రాజా! కోపము నీకు తగదు. మీరు కోపపడిన మేమెంతవారము? చింతపల్లిరెడ్డి, తనకు తోఁచిన మాట తానాడెఁగాక తప్పేమిచేసెను? రెడ్డివంటివానిని పోనాడవచ్చునే? పోయినయెడల రానాడఁగలరా? ఇఁక మాటలెందుకు? రెడ్డిపోయి

బ్రహ్మనాయని చేరఁగలఁడు? మన భూమి పాడయినట్లే. రెడ్డిని తిరిగి రప్పించినఁగాని క్షేమములేదు" అని విన్నవించిరి. రాజు ఆమాటలను సమ్మతించెను; రెడ్డిని తిరిగి తెండని మనుష్యుల పంపెను. రెడ్డి వచ్చి కొల్వుకూటములో నిల్చుండెను. "నేనన్న మాటలకు నీకు కోపమువచ్చినదనుకొందును. పగవానిని పొగడితివి గనుక పట్టరానికోపమున అట్లంటిని. నీవు మా కొల్వులోనే ఉండవలసినది" అని రాజు రెడ్డితో అనెను. "స్వామీ! అనవలసినమాట లాడితిఁగాక. నాయందు తప్పేమి నరనాథచంద్రా నాయనిమీఁదికి నన్నంపుఁడు. నాశక్తికొలఁది పోరాడుదును. మండాదిని ధ్వంసము చేయుదును. పశువులను పాడుతును. నేను మీవాఁడనుగాని పగవారి వాఁడనుగాను" అని రెడ్డిపలికెను. రెడ్డి నిన్ను పంపవలసిన అవసరములేదు, మన్నె నాయకులెందరో ఉన్నారు, వారీపనికిచాలు, నీవు కొల్వులో ఉండవలసినది అని రాజుపలికెను. రెడ్డి కూర్చుండెను.

చెంచులనాయకుఁడు పిధులపల్నిఁడు ఉన్నాఁడు. అతనికి గొప్పబలగము గలదు. అతనికి ఉత్తరము వ్రాసిన రేపీవరకు దుముకఁ గలఁడు. అతఁడు మందను పొడిచి మండాదిని పాడు చేయఁగలఁడు అని నాయకురాలు సలహా యిచ్చినది. పల్నినికి లేఖలు వ్రాసిరి. దూతలు బయలుదేరిరి. ఏలేశ్వరము రేవునద్ద కృష్ణదాటిరి; చెంచుమలలకు పోయిరి. లేఖలు పల్నినికిచ్చిరి.

పల్నిఁడు తుడుములు వేయించెను. ధాగలు మ్రోగినవి. బూరలు మ్రోగినవి. కొంచుకొమ్ములు మ్రోగినవి. కనకతప్పెటలు మ్రోగినవి. చెంచుబలము తరలినది. పల్నినికి అంభారి సిద్ధమైనది. పల్నిఁడు ఏడుచలువలుతీరిన చల్లడము తొడిఁగినాఁడు. దానిమీఁద పట్టుకాశచుట్టెను. పట్టుకాశమీఁద హనుమంతకాశ,

హనుమంతకాశిమీద జేగంటముళ్లు, జేవంతముళ్లపై పింజముల దండ, పింజములదండపై పికిలి కురువేరు, వెలపట నంకిణి, దాపట బాకు, చేత కఠారి, వీపున అంబులపొది. ఈ తీరున శూరవేషము పల్నీడు తాల్చెను; సిద్ధమైన అంభాగిని ఎక్కెను. పోతినీడు, చెంచులమల్లన్న అతనివెంట కదలిరి.

ఈ ముగ్గురు సరిబార్లు ముందునడచిరి. దళమంతా ఖో యని అరచుచు వెనుకవచ్చుచున్నది. నీలి టెక్కెములవారు. భూచక్రగొడుగులవారు, విచ్చుకత్తులవారు, పచ్చబొత్తములవారు, చేకత్తులవారు, పిడిబాకులవారు, చక్రాలవారు వచ్చుచున్నారు. కృష్ణవద్దకుచేరిరి; కృష్ణకు మొక్కిరి; కృష్ణదాటిరి; దూతలు ముందుగా గురిజాలకుపోయిరి.

పల్నీడు వచ్చుచున్నాడు, పాలువాయిమిట్టలవద్దకు వచ్చినాడు అని రాజునకు చెప్పిరి. పల్నీనికి ఎదురుగా నాయకురాలు బయలుదేరినది. పల్నీనికలిసికొన్నది. "కోడి పోరున భూమిని ఓడి బ్రహ్మనాయుడు మండాదిపట్టణము కట్టినాడు. మండాదిని పాడుచేయవలెను. మందను పోడువవలెను. పల్నీడా ఈపనికి నీకు మాచెర్ల ఇత్తును" అని నాయకురాలు పలికినది. పల్నీడు పౌరుషముచూపెను. పోతినీడు పులిమీసము లనెను. మల్నీడు మాకెవ్వరెదురనెను.

నాయకురాలు వీరిని వెంటబెట్టుకొని గురిజాలకు పోయినది. అందఱును నలగాముని కొల్వుకూటమున కలిసిరి. మండాదిని హతముచేయవలసినది, మాచెర్లయిత్తును అని నలగామరాజు పల్నీనికి చెప్పెను. పల్నీడు తన బలిమిని, ధైర్యమును రాజునకు తెలిపెను. తాంబూలము, కట్నములు, బంగారు ఆభరణములు, ముత్యాలహారాలు రాజు పల్నీనికి ఇచ్చెను.

పల్నీడు బలఁగమునుతీసికొని మండాదికి పైనమాయెను. వీరు మాచెర్లకుపోయిరి. చెన్నకేశవునకు మ్రొక్కిరి. తిరిగి బయలుదేరిరి. అన్నమువారిపల్లె, కొత్తకోలదాఁటి పెందోటకను మకుచేరిరి. అక్కడ నలగామునితోఁట ఉన్నది. ఆ తోఁటలో రకరకాల పువ్వులూ ఉన్నవి. తోఁటలో ప్రవేశించి చెంచులు పూలుకోసికొనిరి; చెవులలోఁ బెట్టుకొనిరి; తలలలో చుట్టికొనిరి; మెడలలో వేసికొనిరి; తిరిగి బయలుదేఱి గుండాలబాటకు చేరిరి.

మందను మండాదిని చూచిరమ్మని పల్నీఁడు, వేగులవారి నిద్దరిని పంపెను. వారు హరిదాసుల వేషము వేసుకొని మండాదికి పోయిరి. ఓరుగంటి వైష్ణవులము, తిరుపతికి పోవుచున్నామనిరి. వీరిది మోసపువేషమని మండాదిలో తెలిసినది. తప్పించుకొని బయటఁ బడ్డారు. తరువాత వీరు పశువులమందకు పోయిరి. ఆ మందకు ఒకప్రక్కన గుల్లేరు. తక్కిన వైపుల వెదుళ్లు తుమ్మలు కిఱ్ఱుమని కలిసికొనిపోయి ఉన్నవి. ఆవరణములోపల చవికెలున్నవి. మందిరములున్నవి. ఆటకూటములున్నవి. దుందుభులున్నవి. నాయకుఁడున్నాఁడు. బోయలున్నారు. పుణ్యావులపోతన్న, బూరుగచెన్న, నక్రావుల ప్రోలు నాగన్న, కొరవిరామన్న, కొండబోయఁడు, పరిగంమాలె బోయఁడు, బాలెబోయఁడు, కన్నెమేకల చెన్నబోయఁడు, కాటిబోయఁడు, పింఛము సింగన్న, పిన్నబోయఁడు, గుండెబోయఁడు, గూబరామన బోయఁడు, తోడేటి దామనబోయఁడు, దోరబోయఁడు, నిలువుగాళ్ల నిమ్మన, నిడిదబోయఁడు, తిక్క మేకల తిప్పబోయఁడు, పసుపిధి గంగన్న, దిండెబోయఁడు, మట గాళ్లమాచన్న, మల్లెబోయఁడు, ఎడమగాళ్ల యెఱ్ఱన, వీరు

బోయలు. వీరికి నాయకుడు లంకన్న. ఇతనికి వెంకజోదు అని మఱియొక పేరుగలదు. మందకడకు వచ్చునప్పటికి వేగులవారు గొల్లబోయల వేషము వేసికొనిరి. లంకన్న వారిని చూచెను. వారిని నాయొద్దకు పిలువుమని పయ్యాల వేర్నిపంపెను. మాయ బోయలు వచ్చినారు. "మేము ప్రయాగమాధవుని పశువులకు బోయలము. పయ్యలు, కోడెలు కొన్ని తప్పించుకొని పోయినవి. వెదకవచ్చితిమి" అన్నారు. ప్రధాననాయకుడు నాకు అన్న. నాపేరు వెంకజోదు. మేము దేవుని పశువులజోలికి పోము. "ఉన్నవేమో వెదకి పట్టుకొని పోవలసినది" అని లంకన్న చెప్పెను. "పశువులన్నీ మేతకు పోయినవి; వలయేళ్ల ప్రక్క, పోతువాగులలో, చెరువు కట్టుకాల్వల, తెల్లమాడుగులలో, దేవదారులలో ఉన్నవి. చెంగలి, నేంద్రగడ్డి, సన్నగరిక, పలిగొండ, చిగురింత, కుందురు, చింపరకసువు మేయుచున్నవి.

ప్రొద్దు క్రుంకెను. కోడిగుడ్లవలె కుదురైనవి, చింతపువ్వువన్నెవి, చెంగల్వముచ్చలవి, ఇప్ప చిగురువన్నెవి, ఎన్నోరకాల ఆవులు మందలు మందలుగా తిరిగివచ్చినవి. వచ్చిన మాయ బోయలు మందలుచూచిరి. మా ఆవులు ఇందులో లేవు ఇంక పోయెదము అనిరి. లంకన్న వారికి పాయస మిప్పించెను. త్రాగిరి. బయలుదేరి పోయిరి. మందాడి యీరుల కలవిగాదు మందలో మళ్ళలను గెలుచుట కష్టము; పశువులు పోషించి ఉన్నవి అని పల్నానికి చెప్పిరి. పల్నాని సర్దారులు మందాదియెంత? మంద యెంత? నుగ్గుచేసెదమనిరి. పల్నాడు బయలుదేరెను. నలగాము సేన, చెంచులు, మళ్ళలు, సర్దారులు, ఉత్సాహముతో వెంట వచ్చుచుండిరి.

## లంకన్న ఒరుగు

పల్నీడు మందను పోడుముటకు వచ్చుచున్నాడన్న సంగతి లంకన్నకు తెలిసినది. దుశ్శకునములు అగపడ్డవి. లంకన్న బ్రహ్మనాయని వద్దకుపోయి మందకురానున్న చేటును విన్నవించెను. పల్నీనితో యుద్ధముచేయవలసినదని లంకన్నకు బ్రహ్మనాయుడనుజ్ఞయిచ్చెను. లంకన్న తిరిగి మందకువచ్చినాడు. లంకన్న యుద్ధమునకు సన్నద్ధుడై కొలువుతీర్చి కూర్చున్నాడు. కూటమి మన్నెలగుండె తెల్లకము, సింగనబోయడు వచ్చెను; లంకన్న పాదములకు మ్రొక్కి కూర్చుండెను. కటారికి బిరుదుకట్టి, అమ్ముల దొనలకు అర్ధనారిఘల్లులుకట్టి, వింటికి వెల్లఘల్లులుకట్టి, వీరగంధము పూసికొని పల్లావుల పోతన్న వచ్చెను; లంకన్న పాదములకు మ్రొక్కి కూర్చుండెను. పట్టుచల్లడముకట్టి, పట్టుకాశ బిగించి, పికిలికుంచెలపై పాదుకత్తి పట్టి, వెనులుతిరిగిన పిల్లది, బసివినీడు వచ్చెను; లంకన్న పాదములకు మ్రొక్కి కూర్చుండెను. జముదాళిగట్టి, పొన్నాడబల్లెముపూని సోమినీడు వచ్చెను; లంకన్న పాదములకు మ్రొక్కి కూర్చుండెను. కనకపువ్వుల ధట్టిగట్టుకొని, ఒడలినిండా పరిగంధము పూసికొని అంసరము వల్లెబోయడు వచ్చెను; లంకన్న పాదములకు మ్రొక్కి కూర్చుండెను. లంకన్నకు మొలన చంద్రకపట్టుధోవతి, ఒంటు శ్రీగంధము, మెడను చెంగల్వదండలు, మొగమున తిరుమణి తిరుచూర్ణము, డాకాల అందె, ప్రక్కనకత్తి, వీపున అమ్ముల పొది, చేత విల్లు ఉన్నవి. ఆవిల్లు వెల్లఘల్లులది, పసిడికట్లది, అర్ధచంద్రుని వంటిది. బ్రహ్మనాయని తమ్ములు తంభీముడు, వీరగాముడు అను ఇద్దఱు శూరులు మందలో ఉన్నారు. మీరు బ్రహ్మనాయని తమ్ములు, తప్పనో తాకునో, మీరు

ఇక్కడ ఉండవలదు, మండాదికి పోవలసినది అని లంకన్న చెప్పెను. ఓహో! లంకన్నా! మేము రేచర్లకులదీప కులము, దొడ్డనాయని కుమారులము, శీలమ్మ నాయని తమ్ములము, నిండిన యీ మందనిధిని పోవిడిచి, పాయరానట్టి యీ బంధులవిడిచి, ఈడుబోయలసందటినీ యుద్ధమునకువిడిచి, దండి వీరుఁడా! మీమీద దయలన్నివిడిచి, జన్మతో ఉన్న మాశౌర్యమువిడిచి, ఏతీరు మండాది ఏగుదుము మోయి? మండాది కిప్పుడు మరలము మేము అని తంభీముఁడు వీరగాముఁడు చెప్పిరి; లంకన్న మాకు బ్రహ్మనాయని మారు అనిరి. పల్నాడు మందకు దగ్గఱకు దగ్గఱకు వచ్చుచుండెను.

లంకన్న లేచినాఁడు; ఆవులకు సాగిలి మ్రొక్కెను; "ఆవులారా! ఇంతకాలము దనుక నాకు ఆవులు తల్లి, ఆంబోతులు తండ్రి, అన్నలు తమ్ములు కోడెలు, అక్కలు చెల్లెండ్రు పెయ్యలు" అని వావిదలఁచి ఉన్నాను. ఆవులు నొచ్చిన నాఁడు, వాన గురియక పూరి వాడిననాఁడు, ఆ యిడుములు బాపికాని నేను అన్నమని అనుకొనలేదు. కయ్యమునకు నేఁడు కాలమువచ్చినది. నా ప్రాణములుమీవి, నా శరీరముమీది; నా మనుగడ మిమ్ము పోషించుటకు, నా మగటిమి మిమ్ము రక్షించుటకు అని పలికెను.

"మాచెర్ల వదలి మండాదికి వచ్చునప్పుడు, పెందోటలో బెబ్బులి కంట్లముకరికోడెను కరచిననాఁడు పశువులన్నీ బెదరి పాఱిపోయినవి. కఱికోడె యేదని నాయఁడు అడిగెను. పులి గరచెనని దీనుఁడనై చెప్పితిని. శీలమువారి యింటి నీరాటి కడవ కరచి నీళ్లు త్రాగిన కలుగు మగతనము. మగతనము విడిచి పులి కరచినదని చెప్ప ధర్మమానీకు? కరచుచున్న

పులిని కన్నుల మూచి ఊరకున్న పాతకులను నేను చూడలేను" అని బ్రహ్మనాయఁడాడెను. దేవా! తమరు పెడ మొగము పెట్టిన నా బ్రతుకేల? నా మగటిమి కనబఱచఁగల రోజువచ్చు దనుక ఆడదానికన్న అధముఁడనై ఉందును, అని అంటిని. "ఆవులారా! మిమ్మును కాపాడవలసిన రోజువచ్చినది. నా మగటిమి చూపఁగల రోజువచ్చినది. ప్రాణములైనా ఇత్తును పంతమైనా నెఱవేర్తును. ఆవులారా! నా శరీరములో ప్రాణములుండు వరకు మీమీద పోటు పడనియ్యను" అని లంకన్న ఆవులకు మ్రొక్కుచూ పలికెను.

ఆశిముత్యమరావె, అలివేణిరావె, లేఁతమామిడిరావె, లేఁదోటరావె అని ఆవుల పేరు పేరునా లంకన్న పిలిచెను. పాలు పితికించెను; నురుగులతో పాలు సముద్రమువలె ఉప్పొంగినవి. పల్నీడు, చెంచులు మందకడకువచ్చిరి. బూరలు, ధారలు మ్రోసినవి. భేరీలుమోగినవి. చెంచులు బొబ్బలు పెట్టిరి. ఆవులు బెదరినవి. మంద అంతా అల్లకల్లోలమాయెను. తంభీముఁడు, సరగాముఁడు, చెంచులనెదిరించిరి, పోడిచిరి చంపిరి. వీరిద్దరికితోడు ముత్యాల మల్లువచ్చెను. ముత్యాలమల్లుయుద్ధము చేసెను; నలగామునిసేనను కొంతవరకు కూల్చెను; చివరకు యుద్ధములో చచ్చెను. మల్లు చచ్చినతోడనే అతనిభార్యకు పాపమ్మకు పట్టరాని ఆవేశము కలిగినది.

## పాపమ్మ


పాపమ్మ పసుపుచీరె కట్టుకొన్నది; పసుపురవిక తొడుగుకొన్నది; చెంచులమీదికి కదిసినది; తన మగనిని చంపిన మన్నీలను చంపినది; మరికొంత సైన్యమును పడవేసినది; చెంచులసామిని చేతికొద్దిపొడిచినది. ఆమెచేసిన ఆయుద్ధమునకు

చెంచులాశ్చర్యపడిరి. నలగామునిసేన, చెంచులు, అందఱునూ ఒక్కమొగికూడి ఆమెపై అమ్ములువేసిరి. సురసురస్రుక్కినది; మాచర్లచెన్నుని తలంచినది; ముత్యాలమల్లుపక్కన పాపన్న కూలెను.

పాపన్న పడిపోయినది చూచి బోయలందఱు అరచిరి. చెంచులకు ఉత్సాహము హెచ్చెను. చెవులమన్నీడు చెంచులతో యుద్ధముచేసి ఒరిగెను.

పల్లావులపోతన్న, సింహము సింగన్న లంకన్నను తలంచి నేలకు వ్రాలిరి. సరిదార్లు, మన్నీలు చెంచులచేతిలో చచ్చిరి. మందకురాజు లంకన్న. విల్లందుకొని లంకన్న యుద్ధముచేసెను. చెంచులసోమినీడు, కాటిపోతినీడు, వీధులపన్నీడు లంకన్నను ఎదిరించిరి. లంకన్న కాటిపోతినీని తల తెగవేసెను; వీధులపన్నీని విసరిపడవేసెను; చెంచులసోమినీని చెండాడెను. చిత్తవర్షము వలె అమ్ముల కురిపించెను. నలగామునిసేన, చెంచులు, లంకన్న చుట్టూ క్రమ్మిరి. అమ్ములువేసిరి. లంకన్నకు బాణము ఆయువుపట్టున తగిలినది. అక్కను గిరిగమూడచిని తలంచినాడు; శీలము నాయని చిత్తమున నిల్పినాడు; లంకన్న నేలకొరిగెను.

ఇంక తంభీముడు వీరగాముడు ఇద్దఱున్నారు. వీరిద్దఱును చెంచులనునరికిరి; మన్నీలనుమడియించిరి. పగవారిబలగములో పడిచెడు పాదములు, నడియెముకలువిరిగినవి. గుండెలు, ప్రేవులు కూలినవి; కండలు తెగిపడ్డవి; నెత్తురు కాల్వలైపారినది; తలలు తెగిన మొండెములు తరచైనవి. చివరకు పగవారి దెబ్బలకు తంభీముడు వీరగాముడు ప్రాణములు విడిచిరి. మందకింక నాయకుడులేడు. చెంచులు ఆవులమీఁద అమ్ములువేసిరి. కదుపులు చెలరేగినవి; కళపిళకళపిళకళపిళ కంచెను విరగఁద్రొక్కి-



అంకన్న ఒరుగు.

నవి. పోటుకలెత్తినవి కొన్ని, మోరలు మోపుచేసినవి కొన్ని ఆవులన్నీ ఒక్కపెట్టున ఎగురుచు, ఉరుకుచు, రంకెలు వేయుచు, చిమ్ముచు, గెట్టల క్రింద లంకన్న చితుకుచుండగా చెంచుసేనల మీద దుమికినవి; నలగద్రొక్కినవి. కోడెలను, చూడి ఆవులను, కొన్నిటిని చెంచులు చంపిరి. శంఖచక్రాలబసవన్న, శంభుడు అను ఆవులు చచ్చినవి. కాని మంద వెనుతీయలేదు. చెంచులను చీకాకుపఱచినవి. నలగామసేనలో కట్టుబోతుల వారున్నారు. వారు ఆవులకు మరకట్లు కట్టిరి. ఆవులు చెంచులకు లోబడినవి. ఆవులను తోలుకొని గురిజాలకు చెంచులు బయలుదేరిరి.

పెయ్యాల పెర్నీడు ఒక్కడు మిగిలి ఉన్నాడు. పెర్నీడు మాచెర్లదికిపోయి జరిగినదంతా విన్నవించెను; మందను తోలుకొని పోరుజిల్లెళ్లకు పోయిరని చెప్పెను; చెప్పి తిరిగి మందను కలియబోయి చెంచులచేతిలో పెర్నీడు చచ్చెను. బ్రహ్మనాయుడు సుంకరకేసి ఘుమునికినుమకు, గంగ్రాతికినుమకు కన్న మఱిని, అడ్డముపడ్డవాను తెలుపలకురవకు పోయెను. పశువులు అగపడ్డవి. పశువులవెంట చెంచులున్నారు. బ్రహ్మనాయుడు వారిని ఆపెను. ఎవరుమీరు? పశువులను ఎక్కడికి తోలుకొని పోవుచున్నారు? అని అడిగెను.

నలగామరాజు పంపిన మన్నెలము, మలిదేవునిమందను పొడిచి, బోయలనందరిని చంపి పశువులను తోలుకొని పోవుచున్నాము అనిచెప్పి నీవెవ్వడవు, ఎందుకు వచ్చినావు అని అడిగిరి. మీరు గద్దెత్తసమున కనమదాటితిరి, పశువులను ఇంక పోనీయను అని బ్రహ్మనాయుడనెను. నీకీపల్లడము లెందుకు? లంకన్నంతటివాడు మాచేతిలో హతమాయెను. నీవొక లెక్కగాదు అని మన్నెలు పంతమాడిరి. బ్రహ్మనాయుడు కట్టు

బోతులపనిని త్రిప్పి వేసెను. ఆవులకు మరకట్లు పోయినవి. చెంచులను, మన్నీలను పడద్రొక్కి వెనుకకుమరలి తమ మందకు పోయినవి. మన్నెమూఁకలను బ్రహ్మనాయఁడు కూల్చెను. మన్నీలను చంపెను. బిరుదుబంటులు పృథివికి వ్రాలిరి. అప్పటికి బ్రతికియున్న ఆవులను మరల్చుకొని బ్రహ్మనాయఁడు పోయెను.

అని శ్రీమదక్కిరాజు లక్ష్మీనారాయణపుత్ర......ఉమాకాన్త విద్యాశేఖర ప్రణీతమైన పల్నాటివీరుల కథలలో మంద పోటు సమాప్తము.

# అలరాజు రాయబారము

మూఁడు సంవత్సరములు మండాదిలో నిల్చి లంకన్నను మందపోటులో కోల్పోయిరి. పశువులు అనేకములు నష్టమయినవి. ఇఁక మండాదిలో ఉండరాదని బ్రహ్మనాయఁడు నిశ్చయించెను. శృంగారమద్దిదేవున కృష్ణదాఁటిరి; శ్రీశైలమునకు వచ్చిరి. పర్వతమును భీమావలివారు ఏలుచుండిరి. గరుడలపాలకి, పచ్చలపిడిబాకు కుదువబెట్టి భీమావలివారి దగ్గర భూపాటిసీమను బ్రహ్మనాయఁడు తెగఁగొనెను. ఒక పెద్దపట్టణమునుకట్టిరి. వీర మేడపి అని దానికిపేరు. మిద్దెలు, మేడలు, కోటలు, పేటలు తీరినవి. ఆధారమని పేరుగల కొలువుకూటమును తీర్చిరి. వీర మేడపిలో నాలుగు సంవత్సరముల ఆరునెలలు మలిదేవుఁడు రాజ్యముచేసెను. అప్పటికి లెక్కలు చూచుకొనిరి. వారు మాచెర్లవిడిచి యేడుసంవత్సరముల ఆరునెలలాయెను. కోడి పోరులో ఓడిననాఁటి ఒడంబడిక ప్రకారము ఏడుసంవత్సర

ములే పరభూములలో ఉండవలసి యుండఁగాఁ ఆయేఁడు సంవత్సరములు గాక అధికముగా ఆరునెలలు గడచినవి. ఎక్కువగా తీసికొన్న ఆరుమాసముల పన్ను నలగాముఁడు మలిదేవునికి ఇయ్యవలసియున్నది. ఇందుకు రాయబారము పంపవలెనని రాజులు తలచిరి. బ్రహ్మనాయని ఆలోచన అడిగిరి. "అలరాజు ఇరుపక్షములవారికిని కావలసినవాఁడు; నలగామరాజునకు అల్లుఁడు. ఆడబిడ్డను చూచియైనా అల్లుని చూచియైనా నలగామరాజు సంధికి ఒప్పుకొనును" అని నాయఁడు ఆలోచన చెప్పెను. అలరాజు కొమ్మరాజుకుమారుఁడు. అలరాజు తల్లిపేరు చెల్లమదేవి. తల్లిదండ్రుల అనుజ్ఞతీసికొని అలరాజును గురిజాలకు పంపవలసియున్నది. అందుకొరకు నాయఁడు కొమ్మరాజువద్దకు పోయెను.

కుట్రచేసి కుమారుని చంపునని నాయనిమాటలకు కొమ్మరాజు ఒప్పుకొనలేదు. భట్టునుపంపరాదా, సర్దారును పంపరాదా, రాజుకురాయబారమేమిటి? అని కొమ్మరాజు పలికెను. "నీకుమారుఁడు పోతేగాని సంధి పొసఁగదు. నా కుమారుని బాలుని పంపినా, నా అన్నను పెద్దన్నను పంపినా యుద్ధముచేసి వత్తురుగాని సంధిచేయలేరు. అలరాజు వారికీ కావలసినవాఁడు వీరికీ కావలసినవాఁడు. నాకుమారుని బాలచంద్రుని నీకు ఇల్లడ చేయుచున్నాను. బాలచంద్రుఁడు నీకుమారుఁడుగాని ఇఁక నా కుమారుఁడుగాఁడు. అలరాజు ప్రాణములకు హానివచ్చునని తలఁచుచున్నావు. అంతగా వచ్చిన యెడల నాకుమారుఁడు నీ కుమారుఁడే. కుమారుని కోల్పోయినవాఁడను నేనే అగుదును" అని బ్రహ్మనాయఁడనెను, ఎన్నోవిధముల చెప్పెను. కొమ్మరాజు ఒప్పుకొనెను. తల్లినిఁగూడా ఒప్పించి తీసికొనిపోవలసినది అని

కొమ్మరాజు చెప్పెను. బ్రహ్మనాయుడు చెల్లమదేవికడకు పోయెను. “సాధారణముగా మాయింటికిరావు, కోడిపోరులో గోపన్నను కోల్పోయిననాడు రాలేదు. మందపోటులో లంకన్నను కోల్పోయిననాడు రాలేదు, ఈనాడు ఏమివిశేషము? మాయిల్లు పావనమైనది? మాభాగ్యవశమున వచ్చినావు” అని చెల్లమ్మ అనెను. రాయబారము విషయము బ్రహ్మనాయుడు చెప్పెను. చెల్లమ్మకు ఆమాట పిడుగువలె ఉండెను. దుఃఖమును ఆపుకొని చెల్లమ్మ మాటలాడ మొదలిడెను. “కల్యాణమునుండి మేము వచ్చితిమి. మామామ గతించెను. మాబావలు, మఱదులు కల్యాణములో ఉన్నారు. వారికి సన్తానములేదు. అందఱికీ అలరాజు ఒక్కడే కుమారుడు. కల్యాణమునుండి వచ్చిన మాబలగము నష్టమైపోయినది. కోడిగోపన్న పోయెను. మందపోటులో బోయలెందఱో పోయిరి. మమ్మును ఇంకను నష్టపఱుపవలెనా? వెనుకటి క్రోధములు మనస్సులో ఉంచుకొని అలరాజును చంపం దలచినట్లు నాకగపడుచున్నది. వెనుకటి క్రోధము లేమానుదువా విను.

పద్దనబొమ్మ

నాకుమామకు అలరాచమల్లుగుఱ్ఱము పేరు సవరాల గోడిగ. మీ అన్న పెద్దన్నగుఱ్ఱము పేరు కారుబొల్లడు. అలరాజుగుఱ్ఱపువాని పేరు లింగధానకుడు. పెద్దన్నగుఱ్ఱపువాని పేరు గంగధానకుడు. మనము మాచెర్లలో ఉన్ననాడు, లింగధానకుడు గంగధానకుడు ఇద్దఱును గుఱ్ఱములను పట్టుకొని నీళ్లుదాప చంద్రవంకకుతీసికొనిపోయిరి. గుఱ్ఱములు ఒకదాని చెవినొకటి కఱచుకొన్నవి. నీ గుఱ్ఱమును వెనుకకు తీయమంటే

నీ గుఱ్ఱమును వెనుకకు తీయుమని గు[illegible]యుష్యులిద్దఱును జగడమాడిరి. లింగధానకుడు కొరడా[illegible] కారుబొల్లని కొట్టెను. కారుబొల్లడు తప్పించుకొనెను[illegible]ధానకుడు కొట్టెను. సవరాలగోడిగకు కంటిలో దెబ్బత[illegible] ఆనాటి నుండి సవరాలగోడిగ నీళ్లూ మేతా మానెను[illegible]రాజుకు ఈ సంగతి తెలిసినది. పెద్దన పేరటి బవిరిగడ్డపు బొ[illegible]ల పెండెరము క్రింద అలరాజుకట్టెను. సవరాలగోడిగ[illegible] నది. మేతమేసినది. నీళ్లు త్రాగినది. ఒకనాడు సవ[illegible] గకు ఆభరణములుపెట్టి, సూర్యభేతాళము చేతబట్టి, బొమ్మల పెండరము తనపరాక్రమము తెల్పుచుండగా, కొల్వుకూటమునకు అలరాజు పోయెను. బొమ్మల పెండెరములో క్రొత్తబొమ్మను చూచెను పెద్దన్న. ఆ క్రొత్తబొమ్మ యేమిటో చూచిరమ్మని పెద్దన్న భట్టును పంపెను. భట్టుపోయెను. "ఈ క్రొత్తబొమ్మయెవరిది" అని భట్టు అలరాజును అడిగెను. ఓభట్టూ ఇది నీపేరటి బొమ్మ, నిన్ను పంపినవాని పేరటి బొమ్మ ఇకముందు కట్టుదును అని అలరాజు చెప్పెను. "నాపేరటి బొమ్మను నీవు కట్టినావు. నీవు ఇక్కడనే ఉందువు. నీపేరటి బొమ్మను నేను కట్టి దేశదేశాలా త్రిప్పుదును భట్టును" అని భట్టుపలికెను. అలరాజు నవ్వి ఇది నీ పేరటి బొమ్మకాదు పెద్దన్న పేరటిబొమ్మ అని చెప్పెను. భట్టుపోయి ఈ సంగతి పెద్దన్నకు విన్నవించెను.

బొమ్మ తీసివేయవలసినదని పెద్దన్న అలరాజును గద్దించెను. నీకు ధైర్యమున్న, చంద్రవంక ఒడ్డుకు యుద్ధమునకు రావలసినదని అలరాజుచెప్పెను. ప్రొద్దుప్రొద్దు పొడవకముందు యుద్ధసమయము అని నిశ్చయించుకొనిరి.

## [redacted]ద్రవంక యుద్ధము

పెద్దన్న [redacted] బొల్లని దువ్వెను; పసిఁడిపల్లముకట్టి నాఁడు; నా[redacted]కు నాగుటందెలు తొడిగినాఁడు; పొట్టకు పట్టెడవా[redacted]న గంట అమర్చినాఁడు; మెడకు గజ్జల పేర్లు వేసినా[redacted]పట్టినాఁడు; గుఱ్ఱమునెక్కి యుద్ధరంగమునకు పో[redacted]లరాజు సవరాలగోడిగనెక్కి పౌషరుము గ్రక్కుచు వ[redacted]ఇద్దఱును చంద్రవంకపచ్చగడ్డలమీఁద తారసిల్లిరి; [redacted]ఘళిపించిరి; ఒకరి నొకరు డీకొనిరి. ఈ సమయమున నీవు స్నానమునకు పోయితివి. స్నానముచేసి తిరుమణి దిద్దుకొనుటకు నిల్వుటద్దము ఎదుటఁబెట్టుకొంటివి. మెఱయుచున్న ఆకత్తులు అద్దములో అగపడినవి. అది యేమిటో కనుఁగొని రమ్మని కన్నమదాసును పంపితివి. అలరాచమల్లు, పెద్దన్న, యుద్ధము చేయుచున్నారని కన్నమదాసు చెప్పెను. పెట్టుకొనఁబోవుచున్న తిరుచూర్ణము ఏటిలో గలిపి నీవు యుద్ధభూమికి పోయితివి. రెండు గుఱ్ఱముల మధ్యమున నిల్చుండి ఆఁగవలసినదని ఇద్దఱికిని చెప్పితివి. కారియబొల్లనిమీఁద కుడిచేయి, సవరాల గోడిగమీఁద ఎడమచేయివేసితివి. కారియ బొల్లఁడు కదలక నిల్చుండెను. సవరాలగోడిగ నిన్ను ముందుకు నెట్టినది. అప్పటినుండి నాకుమారునిమీఁద పగబట్టి ఉన్నావు. అలరాజను ఇఁక జగడ మాపుమంటివి. అలరాజు ఆపలేదు. ఆహారము లేకుండా నాకత్తి ఆగదని అలరాజు చెప్పెను. పెద్దన్నా నీవు ఆపవలసినది అని పెద్దన్నకు చెప్పితివి. పెద్దన్న యుద్ధము చాలించెను.

## కత్తులకు ఆహారము

రోకండ్లు, గడ్డపారలు, చెరుకుగడలు, అరఁటిస్తంభాలు పాతించి, మధ్యన నీపేరటి పచ్చబద్దను నిల్పితివి. అలరాజా ఇక

నీకత్తికి ఆహారము పెట్టుకొను మంటివి. పెద్దలుండఁగా చిన్న వానికి ఆపని మొదట తగదనెను అలరాజు. పెద్దన్న ఆయుధము దూసి విసరెను. రోఁకంమ్లు గడ్డపారలు, చెరుకులు అన్నీ తెగినవి కాని నీ పేరటి పచ్చబద్ద అట్లే ఉండెను. అలరాజా ఇఁక నీ ఆయుధమును తీయుమంటివి. సూర్యభేతాళమును దూసి వంకర పాటుగా పచ్చ బద్దపై వేసెను. ఆయుధము పిడిమట్టుకు భూమిలో దిగఁబడ్డది. మామా నా ఆయుధమును పెరికి ఇయ్యమని నిన్ను అలరాజుకోరెను. రాజుల ఆయుధము రాజులకే అలవి యగునుగాని మాకలవిగాదని నీవు చెప్పితివి. ఆయుధమును అల రాజు కాలిబొటనవ్రేలితో గీచెను. ఆయుధము మట్టిని పెళ్లలు పెళ్లలుగా పెకలించుకొని చివ్వున పైకి ఎగిరినది. ఒక మట్టి పెల్లవచ్చి నీనొసట తాఁకెను. "ఓహో పెదవికి పల్లు మించి ఉన్నదే అని నీవు నాకుమారునిమీద క్రోధము పట్టితివి" అని చెల్లమ బ్రహ్మనాయనికి చెప్పెను. "చెల్లెలా చెల్లమదేవీ నీకుమా రునిమీద నాకు క్రోధములేదు. కొడుకుమీది ప్రేమచేత పల్కుచున్నావుగాని నా మనస్సు నీ వెఱుఁగవా? నా కుమా రుని బాలచంద్రుని నీకు ఇల్లడ చేయుచున్నాను, బాలచం ద్రుని మీ కుమారునిఁగా భావించుకొనవలసినది, అలరాజు గురిజాలకు పోకున్న రాయబారము పొసఁగదు, అలరాజును శత్రువులు అవమానించినయెడల వీరుల మందటము ప్రాణముల నైనా ఇత్తుము పగనైనా తీర్తుము, కనుక అలరాజును పంప వలసినది" అని బ్రహ్మనాయఁడు చెప్పెను. చెల్లమ సమ్మతించినది; ఆఁకులు పోఁకలు బ్రహ్మనాయనికి ఇచ్చినది.

బ్రహ్మనాయఁడు మలిదేవరాజు కొల్వుకు తిరిగిపోయెను. అలరాజు డేఁగలవేటనుంచి మరలి యింటికి వచ్చినాఁడు; శివ

పూజచేసి భుజించిపరుండెను. చెల్లమదేవి అలరాజును సమీపించి గోడుగోడున దుఃఖించినది. శత్రువులు బ్రహ్మనాయని బంధించిరా? వీరమేడపిని నాయకురాలు దోయించినదా? లేదు గదా పగవారివలని భంగపాటు? అని అలరాజుపలికెను. నిన్ను గురిజాలరాయబారమునకు బ్రహ్మనాయుఁడు పంపనున్నాఁడు, నాయకురాలు నిన్ను తిరిగి రానీయదు అని చెల్లమ దుఃఖించుచు చెప్పెను. అమ్మా అష్టవసువులు నన్నేమియునూ ఏమీచేయరు, నీ కోడలు వీరమేడపికి ఇంతవరకును రాలేదు, నా అత్తనుచూచి నా మామనుచూచి ఎన్నో యేండ్లయినది, చూచివచ్చెదను, నీ కోడలిని తీసికొని వచ్చెదను, నన్ను దీవించి పంపవలసినది అని అలరాజు తల్లిని బ్రతిమాలెను. తల్లి అలరాజును దీవించినది. కొడుకా! బ్రహ్మనాయనిమాట చేపట్టవలసినది, గురిజాలకు పోయి శుభముగారావలసినది అని కుమారుని చెల్లమ పంపెను. సవరాలగోడిగను సిద్ధముచేసి తీసికొని వచ్చిరి. గుఱ్ఱమునకు అలరాజు మ్రొక్కి-యెక్కె-ను. బసవశంకర బిరుదులు పట్టుకొని బిరుదులవారు వెంట వచ్చుచుండిరి. అలరాజు మలిదేవరాజు కొల్వునకు పోయెను. నలగామరాజునకు రాయబారము సంగతులు వ్రాసి ఉత్తరమును అలరాజుచేతికి బ్రహ్మనాయుఁడు ఇచ్చెను. నీవు నీ అత్తచేతి అన్నము తినవలసినది, భార్యచేత తాంబూలము తీసికొనవలసినది, మరియొకరిచేతిది వద్దు అని బ్రహ్మనాయుఁడు చెప్పెను; అలరాజునకు కన్నమదాసును తోడుపంపెను. ఆయుధములు ధరించి గోసంగులు కన్నమవెంట బయలుదేరిరి. ధారలు, బూరలు, మ్రోయుచుండ, గొడుగులవారు, టెక్కెములవారు, ఆయుధములవారు వెంట వచ్చుచుండ అలరాజు బయలుదేరెను. మోకాలిఝల్లి, కంచుటరిగె, ఘోరభైరవ

ఖడ్గము ధరించి కన్నమ ప్రయాణమాయెను. గురిజాలమార్గము పట్టిరి; ఇసుకత్రిపురాంతకము, ఆకులగణపవరము, అన్నసముద్రము, పలుకూరు, మానేపల్లి దాటిరి.

నవరాలగోడిగకు పెద్దన్న పేరిటి బొమ్మను అలరాజు కట్టినాడు, ఆ బొమ్మను పగవారు చూచుట భావ్యముగాదు, ఏ తీరుననైనా బొమ్మను విడిపించుకొని రావలసినది అని మలిదేవ రాజు కోరెను. నేనాపని చేసెదనని బాలచంద్రుడు తాంబూల మందెను. బాలచంద్రుని వాహనము పొట్టేలు. పొట్టేలునెక్కి బాలచంద్రుడు అలరాజును కలియబోయెను. కంబ్లేరునద్ద ఇద్దఱును కలిసిరి. కంబ్లేరు పచ్చగడ్డలుతెన్నిపట్టి పారుచున్నది. ఏటినిదాటుటెట్లని అలరాజు సంశయపడుచున్నాడు. మన్నె రాజుల కీసంశయము తగునా అని బాలచంద్రుడు పలికెను. అలరాజునకు కోపమువచ్చినది. బాలచంద్రుడు పందెము వేసెను. ఇద్దఱి వాహనములను దుమికింతము, దూకలేని వాహనముసొమ్మును దూకిన దానికి ఇయ్యవలసినది అని ఒడంబడిక. ఇద్దఱును తమతమ వాహనముల నెక్కిరి. నవరాల గోడిగ దుమికినదిగాని వెనకకాళ్లు నీటిలో పడెను. పొట్టేలు ఒక్క పెట్టున అవతలి ఒడ్డునకు దుమికినది. అలరాజు ఓడెను. ఆడిన మాట శూరులు తప్పరు. నవరాలగోడిగసొమ్ములుతీసి అలరాజు బాలచంద్రుని చేతికిచ్చెను. పెద్దన పేరిటిబొమ్మను బాలచంద్రుడు తీసికొనెను. మామగారి యింటికి పోవుచున్నావు, గుఱ్ఱమునకు సొమ్ములు లేకుండా పోరాదు అని తక్కిన సొమ్ములను బాలచంద్రుడు అలరాజుకిచ్చెను.

శతకోటి, ములుకుల అలరాజుదాటెను. మట్టివేముల వద్ద కాపులు అలరాజుకు విందుచేసిరి. కంభాలకనుమదాటి,

అడిగొప్పులకాపులు చెర్లగుడిపాటి కాపులుచేసిన మర్యాదలను పొంది, అలరాజు గురిజాలసమీపమునకు పోయెను. ఆదండును చూచి గురిజాలపట్టణము కలవరపడెను. మీ అల్లుఁడు రాయబారము తెచ్చుచున్నాఁడని నలగామునకు చెప్పవలసినది అని అలరాజు భట్టునుపంపెను. భట్టుచెప్పెను. గురిజాలలో అడావుడి అణఁగినది. అందఱును సంభ్రమముమాని శాంతముగా ఉండిరి. అలరాజు నలగామరాజుకొల్వుకూటమునకు బయలుదేరెను. రాజవీథిని ప్రజలు అలరాజుపాదములకు మ్రొక్కి నివాళులు ఇచ్చిరి. కొల్వుకూటములో పట్టువస్త్రము మామపాదముల మీఁద పెట్టి మ్రొక్కి అలరాజు నిల్చుండెను. నలగాముఁడు అలరాజును గౌరవించి గద్దెపైకూర్చుండఁబెట్టెను; నీవువచ్చిన పని యేమని అడిగెను. ఉత్తరమును మామచేతికి అలరాజుఇచ్చెను. నలగామరాజు నవ్వి పారిపోయినయట్టి పందగొవులకు భూచక్రమందున భూమియెక్కడిది అని తేలికగా పలికెను. అలరాజు భగ్గున మండిపడ్డాఁడు; సూర్యభేతాళమును ఒరనుండితీసి ఝళిపించినాఁడు. చింతపల్లిరెడ్డి లేచి అలరాజుకోపమును చల్లార్పయత్నించెను. వారిభూమి వారికి ఇచ్చుటన్యాయము అనిరెడ్డి నలగామునికి చెప్పెను. కాని నలగామరాజు రెడ్డిమాటల చెవులఁబెట్టలేదు. "ఇదేచెప్పుచున్నాను. కార్యమపూడిలో యుద్ధము చేయవలెను, పోరుఇచ్చుచున్నాను, పత్రపు ఒడంబడికలు తప్పి నీతిమాలినచేష్టలు నీవు చేసితివి, పోరుతప్పదు" అని అలరాజు పలికెను. నలగాముఁడు యుద్ధమునకు సరేననెను. పోరుగైకొని అలరాజు తన నరపతిడేరాకు తిరిగివచ్చెను; కన్నమదాసును పిలిచి పోరునిశ్చయమైనదని వార్త తెలిపెను.



అలరాజునకు పూలగుత్తులతో విషప్రయోగము

అలరాజు అలిగిపోయెనని నలగాముఁడు విచారపడుచుం డెను. నలగామునికి నాయకురాలు సలహాలు చెప్పినది. షడ్ర సోపేతముగా అన్నమును సిద్ధముచేయించి నాయకురాలు అల రాజువద్దకు తీసికొనిపోయి సమర్పించెను. అన్నమును అల రాజుతినలేదు. నాయకురాలు ఒక తంబళివానిని పిలిచినది. "ఎటులైనను ఈపువ్వులను అలరాజుచేతికి ఇయ్యవలసినది" అని తంబళిచేతికి కొన్ని పూగుత్తులు ఇచ్చినది; ఆగుత్తులలో జవ్వాజి, కస్తూరి ఇటువంటి సుగంధద్రవ్యములను చేర్చినది. అలరాజు రణభేరివేయించి ప్రయాణమై తిరిగి వీరమేడపికి బయలు దేరెను; చెర్లగుడిపాటి సమీపమునకు వచ్చినాఁడు.

పూలగుత్తులుపట్టుకొని అలరాజునకు దగ్గరిగా తంబళి పోవుచుండెను. పూలగుత్తులమీఁది వాసన అలరాజునకు వచ్చి నది. వాసన ఘుమఘుమలాడుచున్నది. ఆపూలు ఎచ్చటనున్నవో చూచితెమ్మని భటులను అలరాజుపంపి గుఱ్ఱమును దిగెను; పట్టుపరుపులు అమర్చియున్న అందలములో కూర్చుండెను.

భటులు తంబళిని తీసికొనివచ్చిరి. తంబళి మాయమాటలు కొన్ని చెప్పి పూగుత్తులను అలరాజు చేతికిచ్చెను. అందలము చుట్టును పరిజనము కూర్చున్నది. కన్నమదాసు అలరాజునకు ఎదురుగా ఉన్నాఁడు. పువ్వులిచ్చి తంబళిపోయెను.

ఒకదాని వెంట ఒకటి అన్నిగుత్తులనూ అలరాజు వాసన చూచెను. చూచుచు చూచుచునే అలరాజు పరుపులమీఁద వ్రాలెను. గుత్తులలో నాయకురాలు పెట్టిన విషము కపాల మున కెక్కినది. అలరాజునకు మరల తెలివి వచ్చినది. "బావా కన్నమా నీవుపోయి నాభార్యకు తెలుపుము, నాయకురాలి మోసమువలన మృత్యువువాతఁబడఁబోవుచున్నాను, నా ప్రాణ

ములు పోకముందే నాభార్యను పిలుచుకొని రావలసినది, ఇవిగో నాబిరుదులు, ఇవన్నీ నా తోడునీడఅయిన బాలచంద్రునికి ఇయ్యవలెను, నాసూర్యభేతాళము, నాసవరాలగోడిగ బాల చంద్రునికి ఇయ్యవలసినది" అని అలరాజు పలికెను.

కన్నమ బయలుదేరి గురిజాలకు పోయెను. గుఱ్ఱమును దుమికించుకొనుచు వచ్చుచున్న భైరవాకారుని కన్నమనుచూచి గురిజాల ప్రజలు గజగజవణఁకిరి. నాయకురాలు, నలగాముఁడు భయపడిరి. రాజగృహమును సమీపించి అలరాజుభార్యకు రత్నాలపేరిదేవికి ఈదుఃఖకరమైనవార్తను కన్నమ తెలిపెను.

## రత్నాలపేరిదేవి

పేరిదేవి అన్నిఆభరణములనూ పెట్టుకొన్నది; కొత్తవి పట్టువస్త్రములు ధరించినది; నిండు నీరాటికడవ నెత్తిపై పెట్టు కొన్నది; తంత్రి కొల్చుకువచ్చినది. "పాపకర్ముల ఆదరించు చున్నావు, నాపతిని చంపుట న్యాయమానీకు, ఆడుబిడ్డ ఉసురు తగులకపోదు, మీ తలకిరీటములు ధరణికిఒరుగ, మీప్రజలొక తెరువుగాను, మీరాజ్యమొక తెరువుగాను," అని శపించుచు నిండునీరాటికడవను గుభిల్లున కొల్చుకూటములో పగుల వేసి నది; బయలుదేరి అలరాజుకడకు వచ్చినది. "స్వామీ! రాజ్య ములు మీవెంటరావు. రాజులు మీవెంటరారు. మీతోవచ్చెడి దాననునేను. నాయకురాలు మీపాలిటిమృత్యువాయెను," అని పేరిదేవి యూతీరున కొంతసేపు విలపించెను. అలరాజును పసిఁడి తంగేడుచెట్లక్రింద పట్టుపరుపులమీద శయనింపఁజేసిరి. ప్రా ణముపోయినది. తిరిగి అందలములో అలరాజును పరుండఁబెట్టిరి. అప్పటికి ప్రొద్దుగ్రుంకినది. కాఁగడాలువేసిరి. పేరిదేవి సవరాల

గోడిగను ఎక్కినది. అందలమునకు నలువైపులా సైన్యముమూగి యున్నది. కన్నమదాసు వెంటనున్నాడు.

### అలరాజును వీరమేడపికి తీసికొని పోవుచున్నారు

అందఱును వీరమేడపికి బయలుదేరిరి. మిరియాల, అడి గొప్పుల, కంభంపాడు, మట్టివేముల గడచి ముటుకులదాటు నప్పటికి తెల్లవారినది. పేరిదేవి సవరాలగోడిగను దిగెను; అంద లములో అలరాజు ప్రక్క నగూర్చుండెను; పేరిదేవి కన్నమను పిలిచి "నీవుముందుగా పోయి మలిదేవరాజునకు, మా అత్తమామ లకు చెప్పవలసినది" అని పంపెను.

కన్నమ దీనుడై పోయి యీవార్తను తెలిపెను. కొమ్మ రాజునకు కోపము, శోకము పట్టరానివాయెను. మలిదేవరాజు, బ్రహ్మనాయుడు, వీరులు బయలుదేరిరి. వీరవిద్యాదేవి, శీలమ్మ, చౌదరమ్మ, సుంకరమల్లమ్మ, గండుకేశాంబ, రేవనూళ్లల సూరమ్మ, అన్నసాని, చెన్నసాని, జనుమాల పెద్దసాని చెల్లమదేవిని ఓదార్చుచు తోడ్కొని వచ్చుచుండిరి; అల రాజును కలిసికొనిరి. అందలములో అలరాజు, పేరిదేవి, ఇద్దఱును ఉన్నారు. కొమ్మరాజు చెల్లమదేవి, తహతహతో "ఏడీమానాయన ఏడీఏడీ" అని అందలమును సమీపించిరి; శవముపైబడి విలపించిరి. "అయ్యో! మీరు ఎందుకు ఈ తీరున దుఃఖించెదరు; మీకుమారుడు స్వామికార్యమునందు ప్రాణము లర్పించెను; వీరుల కిదిధర్మము; నేను నాభర్తతో స్వర్గమునకు పోవుదును; మాయిద్దఱను చితిపేర్పించవలసి నది" అని రత్నాల పేరిదేవి అత్తమామలకు విన్నవించినది.

రత్నాల పేరిదేవి సహగమనము.

అందలమును గదలి వీరమేడపిదగ్గఱకు పోయిరి. ఊరిబైట రాచరావులదగ్గఱ అందలమును దింపిరి. పట్టణమంతా కన్నీరు కార్చినది. వీరమేడపి రాచరావులవద్ద గుమిగూడినది. చందనపు కట్టెలతో చితిపేర్చిరి; జంగాలను పిలిపించిరి. కొమ్మరాజు జంగాలు, పెడమటము జంగాలు, వేలకుమించి వచ్చిరి. వారి పిడిగంటలనాదము అన్నిదిక్కు-లా నిండెను. అలరాజును హర హరాయని చితిపైనుంచిరి. చితిలో నిమ్మకాయలువేసి రత్నాల పేరిదేవి అలరాజు పార్శ్వమున చేరినది. పేరిదేవికి, వీరవనిత లందఱును పసపుకుంకుమ సమర్పించిరి. అందఱకును చివర మాట చెప్పినది; ఇంకనన్ను పలు-రింపవద్దన్నది. చితికి నిప్పంటించిరి.

అలరాజుచావు వీరులక్రోధమును రగిల్చెను. కార్యమ పూడియుద్ధమునకు వీరులు సన్నద్ధు లగుచున్నారు.

అని శ్రీమదక్కి-రాజు లక్ష్మీనారాయణపుత్ర......ఉమా కాన్త విద్యాశేఖర ప్రణీతమైన పల్నాటివీరుల కథలలో అల రాజు రాయబారము సమాప్తము.

# బాలచంద్రుఁడు

ఇతఁడు కులమునవెలమ. ఇంటిపేరు రేచెర్లవారు. ఇతని తండ్రి బ్రహ్మనాయఁడు. తల్లి ఐతాంబ. కాపురము మాచెర్ల. మాచెర్ల గుంటూరుజిల్లాపల్నాటిసీమలో ఉన్నది. బ్రహ్మనా

యడు మలిదేవరాజుమంత్రి, మాచెర్లకురాజుమలిదేవుడు, గురిజాలకురాజు నలగాముడు అని యిదివరకు జరిగిన కథవలన తెలిసియేయున్నది. అలరాజు చావునకు కోపించి మలిదేవరాజు వీరమేడపినుండి నలగామునిమీద యుద్ధము ప్రకటించెను. యుద్ధమునకు పోవుచు బాలమలిదేవరాజును వీరమేడపిలో సింహాసనమందుంచిరి. బాలచంద్రునికూడా వీరమేడపిలోనే ఉంచిరి. బాలచంద్రుని వయస్సు 16, 17 సంవత్సరములు.

బాలచంద్రుని పుట్టుక

ఐతమ్మకు చాలాకాలము సన్తానములేదు. ఎన్నోనోములు నోచినది, ఎన్నోవ్రతాలు చేసినది. సన్తతి కలుగలేదు. కుమ్మరావములు చూఅవిడిచినది, పేదబ్రాహ్మణులకు పెండ్లి చేసినది, దోవలలో అమడామడకూ అన్నసత్రాలు పెట్టించినది; చలిపందిళ్లు వేయించినది; పాడుపడ్డగుళ్లు బాగుచేయించినది; శ్రీశైలమునకు పోవు శివభక్తులకు రాగిచెంబులు దానమిచ్చినది; బంగారు గుమ్మడికాయలు వెండి గుమ్మడికాయలు శ్రీశైలమల్లికార్జునునకు కానుకలిచ్చినది; మగడని పెండ్లామని రావిచెట్లకు మంగళసూత్రాలు కట్టించినది. కాని ఎన్ని చేసినా సన్తతి కలుగలేదు. గజనిమ్మ నోమితే కలుగును సన్తానమని ఒకనాడు ఆకాశవాణి వినబడ్డది.

పెద్దలను అడిగి ఈ నోము ఏతీరున చేయవలెనో ఆమె తెలిసికొన్నది. నిమ్మచెట్టుకు పాదుచేసి, అలికి, అక్కడికి వనదేవతను ఆహ్వానము చేయవలెను. పూజచేసి ప్రతిదినము పాదులో నీళ్లుపోయవలెను. కొన్నిదినములకు నిమ్మచెట్టు చిగుర్చును. పూవులు పూసి కాయలుకాయును. కాయలుపండ్ల

గును. పండ్లను దేవునికి అర్పించవలయును. ఈవ్రతము పూర్తి యగువరకూ అన్నము తినరాదు. పండ్లు తినుచుండ వచ్చును.

ఈతీరుగా ఐతాంబ నోచినది. మాచెర్లలోని వైకుంఠ వనములో నిమ్మచెట్టుకు పూజచేసి నీళ్లుపోసినది. సంవత్సర కాలమునకు ఆనిమ్మచెట్టుకు పండ్లు పండినవి. కడసారిరోజున ముత్తైదువలను పిలిచినది. తన సవతులను వెంటబెట్టుకొన్నది. సవతులు, ముత్తైదువలు అందరునూ జలకమాడి కొత్తకొత్త చీరెలు కట్టుకొనిరి. పళ్లెములలో కాన్కలు తెచ్చుచుండిరి. ఐతాంబ తలంటి నీళ్లుపోసికొన్నది; బంగారుజరిపట్టుచీర కట్టుకొన్నది; ఏడువారాలసొమ్ము పెట్టుకొన్నది. పండిన పచ్చని గజనిమ్మపండ్లు బంగారు పళ్లెములో పెట్టుకొని నడచుచుండెను. ఆటకత్తెలు, పాటకత్తెలు, తాళాలు, మేళాలు, తాషామరపాలు, కోలాహలముగా ముందుపోవుచుండెను. వీరి యిలవేల్పు చెన్నకేశవుని ఆలయమునకు పోయిరి. ఆ పచ్చని పండ్ల బంగారుపళ్లెము, స్వామికి ఆమె అర్పించెను. కాని ఎందుకో అదివరకు తూర్పుముఖముగా ఉన్న చెన్నుడు పడమటి ముఖమాయెను. ఐతాంబ మూర్ఛిల్లినది; కొంతసేపటికి తెలివి తెచ్చుకొని ఈతీరున ఉన్నది.

"స్వామీ! మా ప్రాణాలు, మాధనధాన్యాలు, మావస్తువాహనాలు అన్నీ నీవి. మేము నీ అధీనలము. మా అపరాధ మేమి? మావంటి ఆడవారికి ఆపద్బాంధవుడవు. అహల్యను, పాదధూళిచేత పావనము చేసితివి. కుబ్జకు కురూపము పోగొట్టితివి. గోపికల కోరికలు తీర్చితివి. ద్రౌపది మానము దక్కించితివి. ఉత్తరను ఉపేక్షచేయలేదు. తరుణులన్న దయ

గలవాఁడవు. ఈ రమణియందు నీమనసు రాయి అయినదేమి? ఈ ప్రాణాలునీవి. నీకే అర్పింతును. ఆడివారమని తలఁచవద్దు. నెత్తురు నీమీఁదచల్లెదము" అని కత్తిదూసి ఐతాంబ ఱొమ్ముమీఁద పెట్టుకొన్నది. తక్కిన కాంతలు అట్లేచేసిరి. అప్పుడు చెన్నుఁడు తూర్పుముఖమాయెను. ఐతమ్మ చెన్నని స్తోత్రముచేసెను. చెన్నుఁడు ప్రసన్నుఁడై "మీమీఁద కూరిమి చేతనే కోపించితిని. మీమనసు నిలుకడ ఎంతనున్నదో పరీక్షించితిని. మీభక్తికి మెచ్చితిని" అని చెప్పుచుండఁగా ఒక నిమ్మపండు ఎగిరివచ్చి ఐతమ్మచేతిలో వ్రాలినది. మహా ప్రసాదమని ఆపండును తీసికొన్నది; పురోహితునిభార్యచేతి కిచ్చి దీనిని పంచి పెట్టుమన్నది. ఐతమ్మకు ఒకముక్క, ఆరుగురు సవతులకు ఆరుముక్కలు ఆమె పెట్టెను. తానొకముక్క తీసికొన్నది. ఐతమ్మ అన్నది నీవు బ్రాహ్మణివి, పూజ్యురాలవు కనుక నీవు మా అందరికంటె ముందుగా భుజియింపుమన్నది. ఆముత్తైదువ మొదట తినెను. తరువాత సవతులూ ఐతమ్మాతమతమ ముక్కలు తిన్నారు; కాళ్లు చేతులు కడుగుకొనిపోయి స్వామికి మ్రొక్కి తీర్థప్రసాదాలు తీసికొనిరి; వెనుకకు వెనుకకునడచుచు గుడి వెలుపలికిపోయి ఇండ్లు చేరిరి. ఐతాంబ కడుపుతో ఉండెను; కుమారుని కనెను. ఆ కుమారుఁడే బాలచంద్రుఁడు.

## ఇతని చెలికాండ్రు

అనపోతు, కమ్మరకాచన్న, మంగలమల్లు, చాకలచందు, కుమ్మరపట్టి, వెలమదోర్నఁడు, కంసాలచందు పేరు ఇతని చెలికాండ్రు. తనతోడితమ్ములనుగా బాలచంద్రుఁడు వీరిని భావించెను.

బొంగరాలాట

మేడపిలో బాలచంద్రుఁడు ఒకనాఁడు రామచిలుక మాటలు వినివిని, వేడుకపడెను. తరువాత తమ్ములతో గుమ్మడి కాయలాడెను; చెఱుకుపందెము లాడెను; తల్లివద్దకుపోయెను. అమ్మా మాకు బొంగరాలాడుకోవలెనని ఉన్నది, బొంగరాలు చేయించి ఇయ్యవలసినదనెను. బొంగరాలాడవద్దు; మనము వలసలో ఉన్నాము; రోజులు కానిరోజులు; చెయిజారి యెవరికైనా తాఁకును, తిట్టుదురు, దీవనల పొందవలెఁగాని తిట్లు పడుట జయముకాదు అని ఎన్నోవిధాల బొంగరాలాడవద్దని తల్లి చెప్పినది. కాని బాలచంద్రుఁడు వినలేదు. తల్లి ఒప్పుకొన్నది. పనివారిని పిలిపించి మామూలు బొంగరాలు చేయుమన్నది. "అమ్మా రేచర్లవంశజుఁడు బ్రహ్మనాయఁడు, గండువారింటి ఆడపడుచువు నీవు, మీయిద్దఱకును కుమారుఁడను నేను, ఈబాలుఁడు పేదబొంగరా లెట్లాడఁగలఁడు? పైఁడిబొంగరాలే చేయించు, వెండిములుకులే పెట్టించు, పట్టుజాలెలే పేనించు, ముత్యాలకుచ్చులే కూర్పించు" అన్నాఁడు బాలుఁడు. ఈ సందర్భములో బాలుఁడు తల్లికి చెప్పిన వైరాగ్యోపదేశము శ్రీనాథుఁడు రచించిన పల్నాటి వీరచరిత్రనుండి ఉదాహరించుచున్నాను.

"కలుములు నిత్యంబు కావు మాతల్లి
మెఱుపు మెఱసినరీతి మేఘంబులట్లు
బుద్బుదంబులభంగిఁ బోవును చెదరి
యీరీతిఁదలపోసి యెఱుక చేమించి

సంపదవేళనే సకల భోగములు
పొందంగవలె ధర్మములు సేయవలయు
భోగానుభవముచేఁబుట్టి సంతృప్తి
వేసటజనియించి వెగటుగాఁదోఁచు
నటుమీద వైరాగ్య మమరుచునుండు
ధర్మముల్ చేసినఁ దనరుఁబుణ్యంబు
సజ్జనసహవాస సంప్రాప్తికలుగు
వైరాగ్యమధికమై వర్తించుఁబిదప
భోగధర్మంబులు పుట్టినయపుడె
సరవివిరాగిత సంసారమెడయు
సద్గురు పదసేవ సయ్యనఁ గలుగు
నందుచే నిర్వాణ మందిక యగును
గావున భోగముల్ గైకొనవలయు
శాస్త్రంబు లీలాగు చాటి చెప్పెడిని
ధనమందు లోభంబు తగ్గింపు తల్లి
ప్రాణంబనిత్యంబు భవమనిత్యంబు
ద్రవ్యంబువచ్చునా తవిలి వెన్వెంట
నిటువంటి మానవుఁ డీదేహమెడలి
పోయికొన్నాళ్లకుఁ బుట్టునుమరలి
కర్మరహస్యముల్ గాంచినవారు
ద్రవ్యంబునకు నవస్థాద్వయమిట్లు
తనరింపుచుందురు తజ్ఞులు గనుక
నీవెఱుంగని మర్మమే నెఱుంగుదునె
చనినభూపతులెల్ల సమకూర్చినట్టి
చిత్రమౌధనములోఁ జిన్నమేమైనఁ

గొనిపోయి రావెంటఁ గూర్పంగనేల
యాశచాలించుటే యానందపదవి
చెలిమినామాటలు చిత్తమందుంచి
మాకోర్కెలీడేర్చి మమ్ము మన్నింపు."

బాలుఁడు కోరినప్రకారము ఐతమ్మ బొంగరములు చేయించి యిచ్చినది. ఏడుగురు తమ్ములూ ఏడు బొంగరాలూ తీసికొన్నారు. బాలుఁడు తానొకటి తీసికొన్నాఁడు. పొట్టేళ్లకు పసిడిపల్లాలు కట్టించిరి; బలిసిన పొట్టేళ్లమీద ఎక్కి ఆఁటభూమికి బయలుదేరిరి. గచ్చకాయల తిత్తులు, సొగటాలు బంతులు, పిగిలిపిట్టలు, డేగలు, రామచిలుకలు, గోరువంకలు వెంటదెచ్చుచు పరిజనము వచ్చెను. ఊరిబయట చాలురావుల వద్దకుచేరిరి. ఆచాలులో మొల్ల అను రావిచెట్టు గలదు. ఆచెట్టుక్రింద రత్నకంబళ్లు పఱచినారు. వారు బొంగరాలాడఁదలఁచినచోటు అది.

## చూడవచ్చిన జనము

ఆడవారుకూడా చూడవచ్చినారు. అన్నమ్మ అను కోమటిస్త్రీ ఆజనములో ఉన్నది. మొదట బాలుని అడావుడికి బెదరి అన్నమ్మ బొంగరాలాట చూడరానన్నది. ఈమె చెలికత్తె ఒక బ్రాహ్మణిగలదు. చూడఁబోవలెనని యీబ్రాహ్మణి పట్టుపట్టినది. కనుక ఆమెవెంట అన్నమ్మకూడా వచ్చినది. బాలుని చక్కదనముచూచి అన్నమ్మ ఆశ్చర్యపడ్డది. ఇతనిభార్య మన్మథునికి బంగారు కలశములతో పన్నీరు అభిషేకము చేసినది కాఁబోలు లేకపోతే ఇటువంటి భర్తదొరకునా అని అను

కొన్నది. బాలచంద్రుఁడు అందరినీ దూరముగా పొమ్మన్నాఁడు. బద్దెలవారు బరాబరులుచేసి సందడి తొలఁగించిరి.

బాలుఁడు బొంగరములను అనేకవిధముల ఆడించెను; అరచేతిలో త్రిప్పెను; తరువాత నేలమీఁద ఆడించుటకు జాలె గట్టిగాచుట్టి చేతికొద్దీవేసెను. అది ఒక చట్రాతికి తాఁకి యెగిరి మరలవచ్చి అన్నమ్మ మీఁగాలిమీఁద తాఁకినది. ములికి అరికాలు దిగివచ్చి నేలకుతగిలినది. ఆమె "తరగిన ఖర్జూరతరువు చందమున" భూమిమీఁదపడెను. మూర్ఛిల్లినది. అమ్మలక్కలు అందఱును చుట్టూచేరిరి; చెవులుమూసిరి; ఉపచారములు చేసిరి. కొంతసేపటికి మూర్ఛ దెలిసినది. బాలచంద్రుఁడు చేతులు ముకుళించి ఆమెయెదుట నిల్వఁబడి ఉండెను. అన్నమ్మ కోపముతో ఈ తీరున తిట్టినది.

"ఓరి దురాత్ముఁడ యోరిదుర్మార్గ
క్రిందుమీఁదెఱుఁగక కెరలుచున్నావు
గర్వమేటికి నీకుఁ గాంతలయెడను
గలిగినఁ దినవలెఁ గట్టంగవలయు
నెఱుకమాలినచేష్ట లేలచేసితివి
ముఱియంగనేల నీ పొంగెల్ల సణఁగ
ముదిరెమదంబునీ ముదిపెంబు క్రుంగఁ
దగమల్లభూపతి ధనమెల్లనీదు
సదనంబుఁజేరిన సత్తువనుండి
త్రుళ్లుచునున్నావు దుష్టమానసుఁడ
సమరంబులో నిన్ను శత్రులుగ్రుమ్మ
నడిచెడుపదముల నారసాలేయఁ

జూదెపుకనులకు సూదులుగ్రుచ్చ
పినయయ్యలెల్లను మించినబలిమిఁ
జేరివైరులతోడ శ్రీయుద్ధభూమి
నుప్పొంగుచున్నవా రుర్వీశు నెదుట
వారిలోఁగలయుని వడికానవచ్చుఁ
బోతుసింహమురీతిఁ బొదలుచున్నావు
మదమువట్టినగిత్త మాడ్కి మేడపిని
నున్నావుకావర ముడిగెడుఁగాక"

ఈ తిట్లువిని అనపోతు కోపపడెను. కాని చంద్రుఁడు అతని కోపమును అణఁచెను.

"బాలురకాటలు పథ్యంబు గనుక
ఆడితి బొంగరంబది నిన్నుఁదాఁకె
దైవకృత్యంబని తలపకాడితివి
నిన్నింక నేమందు నీరజనేత్ర
అబలవు నిన్నేమి అనవలదైన
నాతప్పు మన్నింపు నయభావమునను"

అని బాలుఁడు అన్నమ్మను బ్రతిమాలుకొనెను; పచ్చవన్నెల పట్టుబట్టలుచించి, ఘనమైనమందులు కాలికి కట్టించెను; గాయము మానుపుకొనుటకు ఐదువందల మాడలు ఇచ్చెను. అమ్మా మా అయ్యలందఱును ఏయుద్ధభూమిలో ఉన్నారు? దయచేసి చెప్పవలసినది, నీవు ఇందాక అంటివి అని బాలుఁడు ఆమెను అడిగెను. కాలినొప్పిచేత ఆతీరున అంటిని; మీ అయ్యలు ఎక్కడ ఉన్నారో నాకు తెలియదు, మీ అమ్మనే అడుగవలసినది అని ఆమె అన్నది. అంతట బాలచంద్రుఁడూ, తమ్ములూ,

ఆటచాలించిరి. ఇంటికిపోయిరి. అమ్మా మా తండ్రియేడి అని చంద్రుడు ఐతమ్మ నడిగెను. ఇదివరకే బ్రహ్మనాయుడు ఎక్కడికి పోయినదీ ఇతడు తెలిసికొన్నాడు; అయినా తల్లి యేమిచెప్పునో అని అడిగెను. ఆమె యీ మాటలు వినగానే గుండెచెదరి క్రిందబడ్డది; ఎంతో దుఃఖపడ్డది; బాలుడు ఇక ఉండడు, అని సంతాపపడ్డది. రాజు మన్నన తగ్గినది గనుక మీతండ్రి యేదిక్కుకో పోయినాడు ఎఱుగనన్నది. అమ్మా

### యుద్ధమునకు పోవుదునని బాలుడు చెప్పుట

నాతో నీవు అబద్ధమాడుచున్నావు, నాతండ్రి కారెంపూడి యుద్ధభూమికి పోయినాడు, ఈసమయములో నేను పోకుంటి నేని అపకీర్తిపాలగుదును, తండ్రి కష్టములను తప్పింపలేని పుత్రుడు ఉన్నా లేకున్నా ఒకటే? ఈ పసిబాలుడు పోయి ఏమిచేయగలడని నీవు అనుకొందువేమో అబ్బబ్బా ఆతీరున ఎంతమాత్రమును అనుకొనవద్దు, నాకు అసాధ్యములేదు, బ్రహ్మాండములబట్టి బంతులాడుదును, మృత్యుదేవతనైనా మెదిపివేసెదను, వీరచరిత్రలు వెలయజేసెదను అని తల్లితో అన్నాడు.

### ఐతమ్మ, శీలమ్మ, సంప్రతించుకొనుట

బాలచంద్రునినాయనమ్మ శీలమ్మ. శీలమ్మదగ్గరకు ఐతమ్మ పోయినది; జరిగినదంతా చెప్పినది. జాతకముచూచెడి పండితుని శీలమ్మపిలిపించినది. పండితుడు జాతకరీతి చెప్పెను. ఇంక పదునైదురోజులలో బాలుడు చనిపోవునని తేలినది. శీలమ్మ యీసంగతి ఐతమ్మకు చెప్పెను. "అయినా పడవలసినపాట్లు పడవలెను. మనమాటలను అతడు నిల్వడు. భార్య మాం

చాల చెప్పితే నిల్వవచ్చును. మాంచాల సౌందర్యము చూచి నట్లైన ఇఁక యుద్ధమునకు పోఁడు" అని శీలమ్మ సలహా చెప్పినది.

### ఐతమ్మ, కుమారుని మరలించుటకు యత్నించుట

ఐతమ్మ యుద్ధరంగమును వర్ణించి బాలుని భయపెట్టినది. కాని బాలుఁడు నవ్వినాఁడు. "ఉప్పొంగు పగవారికి ఉరుమని పిడుగును. గర్వించు పగవారికి కంటిలో నలుసును. నన్ను పసివాఁడని తలఁచవద్దు, చిన్న మిరియమునందు కారముచెడునా" అని సమాధానముచెప్పినాఁడు. తనను కనుటకు పడ్డబాధలన్నీ బాలునికి ఐతమ్మచెప్పినది; కంటనీరు పెట్టినది; "నాయనా నీతండ్రి యుద్ధమునకు పోయినాఁడు. నీవైనా కనులయెదుట లేకున్న ఎట్లు బ్రతుకఁగలను? ఎన్నిపాట్లోపడి నిన్నుకంటిని, వేములు పూసినవి, వేములుకాసినవి, కడసారి ఫలములు కాకులకయినవి అన్నట్లు నా బ్రతుకగును. సూరునితల్లికి సుఖములేదు. పందలై పుట్టితే ఇంట పడియుండఁగలరు. నీవుగడియ అగపడకున్న నిల్వలేను. నీవుపోవుదువా వీరమాతలకు, వీరభార్యలకు విషము పెట్టి పోవలసినది" అని ఐతమ్మ విలపించినది.

### వీరధర్మములు బాలుఁడు చెప్పుట

శ్రీనాథుని పద్యులనే ఉదాహరిన్చుచున్నాను.

"నీవెఱుంగనిధర్మ మేనెఱుంగుదునె
ప్రాకృతభామల పగిదిఁబల్కెదవు?
వెఱ్ఱితనంబేల వీరునిసతికిఁ
గాయమునిత్యంబు కల్మిహాళక్కి
జలబుద్బుదవిధంబు క్షణభంగురములు
షట్చక్రవర్తులు సకలభూపతులు

చనిరి బ్రహ్మేంద్రాది సర్వదేవతలు
భూతంబులైనను బొలియుచునుండు
శౌర్య సత్కీర్తులు సమయ వెన్నఁటికి
సకలపురాణముల్ సద్ధర్మకథలు
నీతిశాస్త్రంబులు నీవెఱుంగుదువు
పౌరుషాధికతచే బ్రదుకుట లెస్స
జననమరణములు జనులకు నిక్క
మాలయంబుననున్న నడవిలోనున్నఁ
దప్పక తార్కొనుఁ దథ్యంబుగాను
బుణ్యలోకంబును బొందుమార్గముల
వినిపింతునేతల్లి విశదంబుగాను
సజ్జనసంగతి సంసారమొడల
గురుబోధించిన గుఱిమీఁదమనసు
నిలిపి మరణమొందు నిశ్చలుండొకఁడు
ప్రాజ్య సామ్రాజ్య సంరక్షణమందు
ఘనరణమ్మున ఱొమ్ముగాయాలనొంద
మనసు చలింపక మరణంబునొందు
శౌర్యపరాక్రమ సంపన్నుఁ డొకఁడు
వీరలిద్దఱు లెస్స వినువీథి కేఁగి
యాదిత్యమండలం బసుదారఁజొచ్చి
పోయిపుణ్యంబుల భూమిఁ జెందుదురు
మొదటికార్యముబూను ముఖ్యతే లేదు
శౌర్యంబు చేమాకు సంపాద్యమగును
శస్త్రధారులకెల్ల సమరంబుకూడు
శౌర్యంబు చాలించి సకలధర్మములు

సేసినసత్కీర్తి చెందదుమాకు
మనువుబోధించిన మార్గమేయిదియుఁ
బరమార్థ కృష్ణుండు భండనభూమి
సవ్యసాచికిఁ దెల్పి సకలధర్మముల
నటుమీఁదఁ జేయించె నధికరణంబు
జనులకుఁ గష్టంబు సమకూరునపుడు
శ్రీవీరవీర్యంబు చెదరంగఁ జేయు
దేశంబుపరనృపా ధీనమౌనపుడు
శ్రీవీరసత్వంబు చిక్కఁగఁబట్టు
సామ్రాజ్యతరువెండి చచ్చెడునపుడు
శ్రీవీరరక్తంబు చిగిరింపఁ జేయు
రాజసేవకులకు రణమేసుఖంబు"

అని బాలుఁడు పలికెను. అయితే నాయనా యుద్ధమునకుపోవు శూరులు తల్లిదీవనపొందిన తరువాత భార్యదీవన పొందవలెను కనుక నీవు నీభార్యవద్దకు పోవలసినది అని ఐతమ్మ చెప్పినది. ఇంతవరకు బాలచంద్రునకును అతనిభార్యకును ఎక్కువ పరిచయములేదు. భార్యను ఇతఁడు దగ్గరకు తీయుచుండినవాఁడు కాఁడు. ఇప్పుడు పోయినయెడల కోపముచేత ఆమె యేమిమాటలనునో అని బాలుఁడు సందేహపడెను. "అమ్మా నేను అపరాధిని నాభార్యను చూచుటకు నాకు మొగముచెల్లదు నేనుపోను" అని బాలుఁడు చెప్పెను. నేను ముందుగాపోయి మంచిమాటలు చెప్పివత్తును తరువాత నీవు పోవచ్చును అని ఐతమ్మచెప్పి, కోడలియింటికి పోయెను. కోడలు నిష్ఠురవాక్యములు పలికినది. కోడలిని మాంచాలను ఐతమ్మ శాంతపఱచెను; నీవెటులైనను బాలచంద్రుని యుద్ధమునకు

పోకుండా చేయవలెనని చెప్పినది. మాంచాల ఒప్పుకొనెను. బాలచంద్రుఁడు తమ్ములను వెంటఁబెట్టుకొని మాంచాలవద్దకు పోయెను.

### బాలచంద్రుఁడు—మాంచాల

తమ్ములును, బాలచంద్రుఁడును గండువారింట అలంకరించిన గదిలో కూర్చుండిరి. పన్నీటికలశములు తీసికొని మాంచాల వచ్చినది. భర్తను ఇదివరకు మాంచాల యెఱుఁగదు. నిన్ను చూచి మఱఁదులు లేతురు, నీమగఁడు లేవఁడు ఇదే మగనికి గుఱుతని మాంచాలకు తల్లి చెప్పినది. మాంచాల వచ్చిన తోడనే బాలచంద్రుని తమ్ములందఱును లేచిరిగాని అనపోతు మాత్రము లేవలేదు. ఇతఁడు బ్రాహ్మణుఁడు కనుక లేచితే మాంచాలకు పాపమని లేవలేదు. అందువలన ఈయిద్దఱిలో భర్త యెవరయినది మాంచాల తెలిసికొనలేకపోయెను. బాలచంద్రుని ఛాయకంటెను అనపోతు శరీరచ్ఛాయమంచిది. బంగారువంటిది. అనపోతుపాదములను మాంచాల పట్టుకొని పన్నీటితో కడుగఁబోయినది. బాలచంద్రునికి కోపమువచ్చునని అనపోతు భయపడ్డాఁడు, అమ్మా నేను నీమఱఁదని, అదుగో బాలచంద్రుఁడు నీమగఁడు, ముందు అతనిసేవ చేయవలసినది అని అన్నాఁడు. మాంచాలఅన్నదీ నేను మఱఁదినీ యెఱుఁగను మగనినీ యెఱుఁగను, అయినా నీవు బ్రాహ్మణుఁడవు, వేదములు శాస్త్రములుచదివినవాఁడవు, నీపాదములు మొదట కడిగితే తప్పులేదు, పెండ్లి ఐనదేకాని నన్నుభర్త యెఱుఁగఁడు, నేను భర్తను ఎఱుఁగను, నాపూర్వతపస్సంతా యిప్పుడు ఫలించినది, ఇట్లనైనా నన్నువిడువక ఉండవలెను గదా అని అనపోతుతో అన్నది; "ప్రియురాలిని చూడవచ్చు

నప్పుడు ఇతరులను దెచ్చుటయేమినీతి?" అని భర్తతో అన్నది. తమ్ములందఱనీ పోమ్మన్నాఁడు బాలచంద్రుఁడు. మేము బయటికి పోవుదుముగాని యుద్ధముమాట మఱచి సుఖములు అనుభవించుట వివేకముకాదన్నారు తమ్ములు. కాయమిక్కడ, మనస్సుకలనిలోపల, శ్రీగిరీశునిఆన, చెన్ననిఆన, మీారు ఎన్ని రోజులు మాంచాలతో ఉండుమన్న అన్నిరోజులే ఉండెదను అని బాలచంద్రుఁడు పలికెను. ఏడుజాములకన్న ఎక్కువ సేపు ఉండవద్దన్నారు తమ్ములు. అంతట తమ్ములు బయటికిపోయిరి. భర్తను మాంచాల మేడమీాదికి తీసికొని పోయినది; అక్కడ ఉన్న పలువిధములైన చిత్తరువులను చూపినది; బాలుని మేడపైన ఉండుమన్నది; శృంగారించుకొని వత్తునని తాను తల్లి నద్దకు పోయినది.

రేఖాంబ—మాంచాల

మాంచాల తల్లిపేరు రేఖాంబ. అమ్మా బాలుని పోకుండా పట్టు ఉపాయము చెప్పవలసినది అని తల్లిని మాంచాల అడిగెను. రేఖాంబవీరభార్య; వీరమాత. "అమ్మాయీా, జన్మమును చెట్టునకు రెండుపండ్లు; భోగములు ఒకపండు, కీర్తి రెండవపండు; మొదటిపండురసము క్షణభంగురము. రెండవపండురసము శాశ్వతమైనది. సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములు ఉండువరకును ఉండునది. మొదటిపండు రుచిచూచి సాధారణులు ఊరకుందురు. దానికొరకే పెనఁగులాడుదురు. వీరాంశమున పుట్టినవారు అట్లుకాదు. వీరు రెండవపండుకొఱకు పరుగెత్తుదురు. ముద్దులమాంచాలా ముదముతో వినుము. నీభర్త వీరుఁడు. మీాయిద్దరికీర్తి రాబోవు జనుల హృదయములందు వర్ధిల్లఁగలదు. కనుక బాలుని ఆగఁబట్టవలదు" అని ఉపదేశముచేసినది.

### మాంచాల బాలచంద్రునికి యుద్ధమునకు జ్ఞప్తికి తెచ్చుట

ఈమాటలు విని మాంచాల మనసు గట్టిచేసికొన్నది; శృంగారించుకొని భర్తవద్ద కేగినది. కొంతసేపు ఇద్దఱును సరసములాడుకొనిరి. బాలచంద్రుడు యుద్ధము మఱచినట్లుగ పడెను. మీతమ్ములు పెట్టిన యేడుజాములగడువు దాటినది, కులవైరము తీర్చుటకు మీరుకాక మఱెవ్వరున్నారు? నాతో సరసములాడుచుండిన ప్రయోజనమేమి? యుద్ధమునకు బయలు దేఱవలసినది అని అన్నది మాంచాల. ఇంతలో తమ్ములువచ్చి కత్తులుత్రిప్పుచు భయంకరముగా బొబ్బలు పెట్టిరి.

### బాలచంద్రుడు తమ్ములపై గర్జించుట

బాలచంద్రుడు ఆబొబ్బలువిని కత్తిదూసి బయటికివచ్చెను. తమ్ములన్నారూ అన్నా త్రిప్పిపెట్టిన కత్తిదూయుట యేమి గొప్ప? శత్రువులవిడిచి తమ్ములమీదికి దుముకుచున్న నీశౌర్యము బాగడవచ్చును! శూరుడని యెన్నో బిరుదులు నీకు రాజు ఇచ్చినాడు, అలరాజును శత్రువులు విషముపెట్టి చంపిన సంగతి, అలరాజుభార్య అగ్ని ప్రవేశము చేసిన సంగతి తలచుకొన్న, నీమనస్సు దగ్ధముకాదా, మమ్మైనను యుద్ధమునకు పంపు, కులవైరముతీర్చి నీకు కీర్తి తెచ్చెదము అని అన్నారు. బాలచంద్రుడు సిగ్గుపడి తలవంచెను; తిరిగి మాంచాలవద్దకు పోబోయెను. గదివాకిటివద్దకు మాంచాల వచ్చినది. ఆమెచేతికి బాలుడు కత్తినిచ్చెను.

### మాంచాల దీవనలు ఇచ్చుట

గరుత్మంతుని బలము మీకు కలుగును, భీముని సాహసము మీకు కలుగును, కృష్ణునికీర్తి మీకు కలుగును, శ్రీశైల మల్లి


కార్జునుఁడు మాచెర్ల చెన్నకేశవుఁడు, మిమ్ము కాపాడుదురు. కలియుగములో మీకు వీరఖ్యాతులు అమరును. ఈ ఆయుధము మీకు జయము ఇచ్చును, అని తనచేతనున్న ఖడ్గమును మాంచాల బాలచంద్రునికి ఇచ్చినది. "స్వామీ మీరు అనపోతును వెంటఁదీసికొనిపోవద్దు, అనపోతు బ్రాహ్మణుఁడు, అతఁడు యుద్ధములో చచ్చెనేని మీకు బ్రహ్మహత్యవచ్చును. పార్వతీశ్వరునంతటివాఁడు బ్రహ్మహత్యవలని పాపము పోఁగొట్టుకొనుటకు పలుపాట్లుపడెను, మనుష్యు లెంతటివారు? మాయచేసియైనను అనపోతును ఇంటికి పంపవలసినది" అని భర్తకు మాంచాల చెప్పినది. సరేనని బాలుఁడు తల్లివద్దకుపోయెను.

### ఐతాంబ బాలునికి దీవనలిచ్చుట

తల్లిని అడిగి అన్నము పెట్టించుకొని తినెను; విలువగల వస్త్రమును కట్టుకొనెను; రత్నములు, మణులు అమర్చిన భూషణములు దాల్చెను. తల్లికి మ్రొక్కెను. కొడుకా నీకు ఇంద్రుని వైభవము కలుగును, వీరభద్రుని విజయకలుగును, గరుత్మంతుని వేగము కలుగును, రామచంద్రునిరాజసముకలుగును, భీముని బలముకలుగును, ఇఁక యుద్ధమునకు పోవలసినది అని తల్లి దీవించెను.

### బాలచంద్రుఁడు అనపోతును వెనుకకుపంపుట

"అనపోతు కాక తక్కినతమ్ములను ఒకచోటికిచేర్చి తాను పన్నిన ఉపాయమును చెప్పెను. వారును గ్రహించిరి. తరువాత అనపోతు, తక్కినతమ్ములు బాలచంద్రుఁడు, ఒకచోట కూడిరి. ముత్యాలహారము, ముద్దుటుంగరము మరచివచ్చితిని, అవి మీవదినెవద్ద ఉన్నవి, నేను తిరిగి పోయితినేని దుశ్శకున



నాయకురాలిసుమ.

మగును, కనుక మీలో ఎవరైనాపోయి తీసికొనిరావలసినది" అని బాలుడు తమ్ములనడిగెను. నేను అలసితినన్న నేను అలసితినని అందఱును మాయమాటలాడిరి. అనపోతుకు ఈమాయ తెలియదు. అన్నా నేను పోయితెచ్చెదను నాకు గుర్తులు చెప్పవలసినది అని అనపోతు పలికెను. గుర్తులుచెప్పి బాలుడు అనపోతును పంపించెను.

తక్కిన తమ్ములతో బయలుదేరి చంద్రుడు త్రిపురాంతకముచేరెను; అక్కడ తాటాకుమీద ఘంటముతో కొన్ని సంగతులువ్రాసి ఆతాటాకును రావిచెట్టు కొమ్మకు కట్టినాడు; మరల బయలుదేరెను; త్రోవలో ముటుకూరు, గరికెపాడు, మేళ్లవాగు అను గ్రామములను దాటెను. ఆయా గ్రామములవారు ఊరిబయటికివచ్చి బాలచంద్రునికి తగిన మర్యాదలు చేసిరి. వారినందఱిని బాలుడు ఆదరించెను; వారికి పోకలు ఆకులు ఇచ్చి పొండని వెనుకకు పంపెను.

### బాలచంద్రుడు నాయకురాలి సైన్యములో ప్రవేశించుట

ప్రయాణము చేసిచేసి బాలుడు తమ్ములతో నాయకురాలికనుమకుచేరెను నాయకురాలు అడ్డగించినది. ఆడదానితో పోరుట ఏమి పౌరుషమని ఆయుధముతో మఱియొకమార్గమేర్పఱచుకొని చంద్రపు కనుమ దాటెను. అక్కడ నల్లగొండ అని ఒక ఎత్తైన బోడుగలదు. ఆబోటిమీదికి బాలచంద్రుడు ఎక్కెను. గుఱ్ఱముల సకిలింతలు, ఏనుగుల ఘీంకారములు, నగారాల ధమధమలు సైనికుల అరపులు, కోలాహలముగా ఉన్న కారెంపూడియుద్ధరంగమును బాలుడు చూచినాడు. అతని అంతశ్శక్తి ప్రజ్వలించినది. తమ్ములను పైకిరమ్మన్నాడు.

వారి బుజములమీద చేయివేసి ఆకారెంపూడి యుద్ధరంగమును చూడండి అన్నాడు. పగతీర్చుటకు మనము పోవుచున్నాము, మనసైన్యమువచ్చినదనుక ఉండిపోవుదము కొంచెముసేపు విశ్రమింతము అని బాలచంద్రుడు తమ్ములకు చెప్పెను. అందఱును అక్కడ విశ్రమించిరి.

వెలమలదోర్నీడు రణరంగమును వివరించుట

బాలుని సైన్యమువచ్చి నలగొండక్రింద విడిసినది. బల్లరగండడు బాలచంద్రుడు నలగొండ పైనుండి మరల రణరంగమును చూచెను. తమ్ముడు వెలమ దోర్నీడు బాలునికి రణరంగము విషయమయి చెప్పెను.

"వెనుకటి రాజులు విక్రమస్ఫూర్తి
గట్టునఁ జెలరేగి కదనంబుసల్ప
వీరలరక్తంబు విసువక త్రాగి
మత్తిల్లియల్లన మలయుచునున్న
నాగులేఱల్లదే నాయనిసుతుఁడ

ఈ రంగమునకు జూలకల్లు, సన్నెగండ్ల తూరుపుహద్దులు. నలగొండసమీపభూమి దక్షిణపుహద్దు. పడమటిహద్దు వప్పిచెర్ల. చింతపల్లి, కొదమగుండ్ల ఉత్తరపుహద్దులు. నలగామరాజు గుడారముచుట్టూ పారాడున్న సేనాపతులను చెప్పెదను. పడమటి దిక్కున పౌజులబ్రహ్మ. తూరుపున సంకోజిగణపతి. దక్షిణమున నాయకురాలు. ఉత్తరమున అందెలరాముఁడు, నెమలిపురి ముమ్మడిరెడ్డి, పొందుగుల వీరమల్లు. వీరికందఱికిని పైనాఁడు నరసింహభూపతి. నాగులేటి పడమటిబడ్డు అండగా రేవంతుని బయలులో మన మలిదేనరాజుసేన ఉన్నది. మన

వీరులలో ఒక్కొకఁడు ఒకలక్షదళమును చంపఁగలవాఁడు" అని దొర్నీడు వివరించెను. బాలచంద్రుఁడు నలగామరాజు సైన్యముమీద దూఁకవలెనని ఉత్సాహపడెనుగాని పెద్దలంతా ఉండఁగా నేనుబోయి కలఁతపుట్టించితే రాజేమనునో, తండ్రి యేమనునో వీరులేమందురో అని సంకోచించెను. "ఈ సంకోచమెందుకు? పోయి వీరులను వార్తలడుగుదము. సంధిచేసికొన్నాము, యుద్ధము లేదందురా పోయి రాజునుచూతము. రాజుఅనుజ్ఞ తీసికొని యుద్ధము ఆరంభింతము" అని బాలునికి తమ్ములు చెప్పిరి.

## బాలచంద్రుఁడు కారంపూఁడిచేరుట

దండును తమ్ములను వెంటఁబెట్టుకొని బాలచంద్రుఁడు రణరంగముచేరెను. మలిదేవరాజు కొల్వుతీర్చి కూర్చున్నాఁడు. బ్రహ్మనాయఁడు, వీరులు, రాజసన్నిధిని ఉండిరి. రాజసభ క్రిక్కిరిసి ఉన్నది. అడావుడిచేయుచు, తొలగుఁడు తొలగుఁడు అని దండుపలుకుచుండఁగా బాలచంద్రుఁడు సింహపుపిల్లవలె కదలి రాజసభకు వచ్చుచున్నాఁడు. అడిసరవు సంధికి వచ్చిన రాయబారుల మొగములు వెలవెలఁబోయినవి. ఇతఁడు వచ్చినాఁడు, ఇక సంధి ఆశలేదు, అని అనుకొనుచున్నారు.

## బాలచంద్ర కన్నమదాసుల సంవాదము

బాలచంద్రుఁడువచ్చి సభామంటపము వాకిట నిల్చున్నాఁడు. ఓ వీరులారా నాకు దోవ ఇయ్యవలసినది రాజుదగ్గరకు పోవలెనన్నాఁడు. వీరులు ఈ మాటలు లక్ష్యపెట్టలేదు. "మండుకారడవుల మంట చందమున, రణరంగమునయందు రాజిలువాఁడు, బాసదబ్బరగండ బ్రహ్మన్నసుతుఁడు, పరవీర భయ

దుండు బాలచంద్రుఁడు, పదములుధట్టించి బాహువులెత్తి సాహసముప్పొంగ శౌర్యంబు మెఱయ, కుప్పించి దుమికెను గుఱుజయమొప్ప, వసుధేశుసన్నిధి వ్రాలెనతండు." బాలచంద్రుఁడు రాజుకు దండప్రణామము చేసెను. దుమికి తనయెదుట నిల్చుచున్న బాలచంద్రునిచూచి, మొగమును మలిదేవరాజు వెనుకకు త్రిప్పెను. ఇంతలో కన్నమనీఁడు కత్తిదూసెను. బాలుఁడా మేము నీ కన్నులకు అగపడలేదా? ఏపాటి బంటనని మేమందఱము ఉండఁగా మామీఁదుగా దుమికి రాజుదగ్గరనిల్చితివి. తక్షణమే ఇక్కడనుండి పోతివా పో లేదా నీతల తెగవేసెదను అని కన్నమనీఁడు కత్తిఝళిపించుచు భయంకరముగా పలికెను. బాలచంద్రుఁడు భయపడువాఁడా? కాఁడు. "సరిగా పంచుకొన్న రాజ్యము పోఁగొట్టుకొన్నారు, వాగులలో నీళ్లు వనములలోపండ్లు తిని అలసినారు; యుద్ధము మఱచినారు; త్రుప్పుపట్టిన నీకత్తి పగవానిమీఁదికి పోలేదు, నా కంఠముమీఁదవేసి తుప్పువదలించ దలఁచినావా మంచిది; నేను రాజును చూడవచ్చినప్పుడు మీరెవ్వరును ఎడమీయలేదు; అదియేమి నీతి? మిమ్మును బ్రతిమాలలేక మీమీఁదుగా దుమికిపోయితిని నాయందు తప్పేమో ఈ తగవర్లను అడుగు" అని బాలచంద్రుఁడు పలికెను. "పసివాఁడా నీకీపెద్దమాటలెందుకు? కొలువులో జరిగిన రాచకార్యాలు నీకు ఏమీ తెలియవు. మరల ఈ తీరుగా మాటలాడుదువా! నీతల దెగవేయుదును" అని కన్నమనీఁడు పలికెను. "నాతలమాట అట్లుంచు. మీ తలలు తెగుటకు సిద్ధముగా ఉన్నవి. శత్రుసైన్యము సముద్రమువలె పొంగివచ్చుచున్నది. అది ముందువిచారించు. రాజునెందుకు యుద్ధరంగమునకు తెచ్చినారు? నీవు బ్రహ్మనాయనికి

బంధువుఁడవఁట. కనుక నేనింత శాంతముతో మాటలాడు చున్నాను. నీకును బ్రహ్మనాయనికిని ఎటువంటి బంధుత్వము ఉన్నది చెప్పు" అని బాలుఁడు అనెను. నారాయణావతార మైన బ్రహ్మనాయఁడు మాతల్లికి వరమిచ్చినాఁడు, నేను పుట్టితిని, బ్రహ్మనాయని పాదసేవకుఁడను, జ్యేష్ఠపుత్రుఁడను, భుజ ముల మీఁద నా ముద్రలు చూడు, శత్రువులను నేను సహింప ను. బ్రహ్మనాయనికి నేను పెద్దకుమారుఁడనైతిని, నీవు తరు వాతపుట్టితివి, నన్ను నీవు ధిక్కరించుచున్నావు అనెను కన్నమ నీఁడు. సరే నీవు పెద్దకుమారుఁడవైతే నీతల దన్ని పుట్టిన వాఁడను నేను; అన్నతొడలు గద్దెలుచేసి తమ్ముఁడు త్రొక్కిపోవచ్చును; అందుకే నిన్ను దాఁటిపోయితిని; అంతేకాని నాకు గర్వములేదు అని బాలచంద్రుఁడు పలికెను. కన్నమనీఁడు తలవంచెను; కత్తిని క్రిందఁ బడవేసెను; బాలచంద్రుని కౌఁగిలించుకొనెను.

### బాలచంద్రుఁడు రాజును దూషించుట

కన్నమనీఁడు చూపిన ఆదరణమునకు బాలచంద్రుఁడు సంతోషించెను. బాలచంద్రుఁడు మరల రాజునకు నమస్కా రము చేసెను. కాని రాజు తలవంచి యేమీమాటాడలేదు. బాలచంద్రుఁడు ఈవింతచర్యకు ఆశ్చర్యపడ్డాఁడు. "వీరులారా! ఈరాజుచర్యచూచినారా? యుద్ధము మఱచినాఁడు. రాజ్యము శత్రువులకు అర్పించినాఁడు. ఎండకన్నెఱుఁగని యీరాజు అడవులలోతిరిగి, నీడలనిలిచిననీళ్లుత్రాగి, పొలపుకూరలు భుజించి నాఁడు. అందువల్ల పసరు కన్నులకెక్కి పలుకకున్నాఁడు" అని బాలుఁడాడెను. కన్నమనీఁడు బాలుని మాటలకు కోపపడెను. "రాజును ఎందుకు నిందించవలె? తప్పులన్నీ మనమీఁదనే ఉన్నవి.

రాజ్యము పోయినది మనవల్ల. యుద్ధమువచ్చినది మనవల్ల" అని బాలుని కన్నమగద్దించెను. "నీవు పగవారికి భయపడ్డట్లు కనఁబడుచున్నావు, యుద్ధము వచ్చినదని తల్లడిల్లుచున్నావు, శత్రువులను దగ్ధముచేయఁగలవాఁడు ఈ బాలచంద్రుఁడు నన్ను చిన్నవాఁడని తలఁచవద్దు; అలరాజును శత్రువులు విషముపెట్టి చంపినపుడు, నాతండ్రి నన్ను కొమ్మరాజుకు అర్పించెను; వీఁడు నీ పగతీర్చునని కొమ్మరాజుకు చెప్పెను; తీరా యుద్ధమునచ్చినపుడు పందవలె మాటలాడుట తగవుకాదు" అని బాలచంద్రుఁడు కన్నమతో అనెను. సభలో ఉండిన వీరులందఱికి బాలుఁడు ఉద్రేకము కలిగించెను. "ఓ కొమ్మ రాజా నీవు బ్రతికియుండఁగానే నీ కుమారుని శత్రువులుచంపిరి; శౌర్యము నీయందు చచ్చినదా యేమి? ముక్కుదూలముమీఁద పొడిచినప్పుడు గుట్టుమనలేని నీ కోపమెందుకు? గండుకన్నమ దాసా! ఆవాలనాయఁడా! సుంకరరాముఁడా! చెవులనాయకు లారా! జంగిలినాయకులారా! వీరధర్మము మఱచి నిద్రించుచున్నారేమి? కాశగట్టినారు, కత్తిపట్టినారు పగయీదలేని పౌరుషమెందుకు? ఓ బాదన్నా నీపాటవమేదీ? పెనుమాలవారు బిరుదులను భూమిలో పాతివేయవచ్చును. ఓ శూరులారా యుద్ధ సూర్యోదయమైనది. నిద్రచాలించిలెండులెండు" అని రోషము పొంగునట్లుగా బాలుఁడు పలికెను. తండ్రి బాలచంద్రుని దగ్గఱకుపిలిచి శాంతపుమాటలు చెప్పెను. కాని ఆమాటలు బాలుఁడు వినలేదు. ఓ బ్రహ్మనాయఁడా నాకు ఈ శాంతపు మాటలు చెప్పకు, శత్రువుతల తెగఁగొట్టుదును నాకు శంక లేదు అని బాలుఁడాడెను.

### కొమ్మరాజు బాలుని కోపము చల్లార్చుట

బాలచంద్రుని రెట్టపట్టుకొని కొమ్మరాజు తనవద్ద కూర్చుండఁబెట్టుకొనెను. "నాకుమారుని అలరాజును చంపిన పగఁగదా నీవు తీర్తుననుచున్నావు. విషముచే చచ్చినవాఁడే బాలచంద్రుఁడను కొందును. బ్రతికియున్న నీవే అలరాజు అనుకొందును. శత్రువులు సంధికి వచ్చినారు. అలరాజును వారు చంపినందుకు మనము నరసింహభూపతిని చంపవలెనని ప్రతిజ్ఞపట్టితిమి. మన రాజ్యము మనకు ఇత్తుమన్నారు. నరసింహభూపతిని మనకు ఒప్పగింతుమన్నారు. చంపినా, రక్షించినా ఆభారము మనదేను. ఇంతకంటెను మనకు కావలసినదేమిటి? కనుక నీవు కోపమును విడువుమోయి నాయనా!" అని కొమ్మరాజు బాలుని శాంతపఱచెను. బాలచంద్రుఁడు కోపమును అణఁచుకొనెను. నలగామరాజు చెప్పిపంపిన సంధిషరతులు బ్రహ్మనాయఁడు మొదలగువారు ఒప్పుకొన్నారు. నరసింహభూపతిని చంపకుండా క్షమించుటకు అంగీకరించినారు. ఇరుపక్షములవారికిని సంధి సమ్మతమైనది. బాలచంద్రుఁడు అనపోతును వెనుకకు పంపెను గదా. అనపోతు ఏమైనాఁడో చూతము.

### అనపోతు

అనపోతు మేడపికిపోయి మాంచాలను ముత్యాలహారము, ముద్దుటుంగరము ఇయ్యవలసినదని అడిగెను; బాలుఁడు చెప్పిన గుర్తులుచెప్పెను. ఆమెనవ్వినది. "ఇన్ని శాస్త్రములు చదివితివి. ఈ రహస్యము ఎఱుఁగకపోయితివి, మీవారందఱూ యుద్ధమునకు పోవునప్పుడు మూఁడునెలలు గడువుపెట్టి మీ అన్నను బాలచంద్రుని మంత్రినిచేసిపోయిరి. ఆమూఁడు

నెలలు దాఁటిపోయినవి. అందువలన మీ అన్న బయలుదేఱి పోయినాఁడు. పోవుచు నిన్ను మంత్రిని చేసిపోయెను. యుద్ధమునకు రాకుండా ఉండుమని నీకు చెప్పితే ఉండవని ఈ ఉపాయముపన్ని నిన్ను వెనుకకు పంపినాఁడు. నీవు యుద్ధమునకు పోఁగూడదు. మేడపికాపాడుచు ఉండవలయును" అని మాం చాల చెప్పినది.

బాలుఁడు రావిచెట్టుకు కట్టి తాటాకు అనపోతు చదువుట.

అనపోతు ఉగ్రుఁడై యుద్ధభూమికి బయలుదేఱెను. త్రిపురాంతకమునకు చేరెను. బాలచంద్రుఁడేమయినా చెప్పినాఁడా అని అచ్చటివారినడిగెను. తాటాకుమీఁద ఏమో వ్రాసికట్టి పోయినాఁడని రావిచెట్టును చూపిరి. అది అనపోతు చదివినాఁడు. ఈవిధమున ఉన్నది.

"శ్రీగిరీశుని యాన! చెన్నుని యాన!
మలిదేవరాజాన మాతండ్రి యాన;
అల్లాదాల్లూరు వీరులందఱి యాన
త్రోసివచ్చితివేని ద్రోహమంటెడిని
బాలుని మిత్రుల ప్రాణంబులకును
తప్పినలాగాను దరలితివేని
నానలు మీఱుట యదినీతిగాదు
తనసంగడీలతోఁ దరలె బాలుండు
సాహసమున నీవు సాగిరావద్దు"

అను కఠినమైనఆనలు చదివి అనపోతు క్రుంగిపోయెను. "నేను బ్రాహ్మణుఁడను అన్ని శాస్త్రములు చదివితిని; వెలమబాలుని అన్నగా భావించితిని; కులమున కొదువని నేను బాలునిచేరలేదు.

వీరుఁడను గనుక బాలునిచేరితిని; చివరకు బాలునిభార్యవద్ద అవమానము పొందితిని; కాఁకులయుద్ధములో నానేర్పుచూపవలెనని ఎంతో కుతూహలపడితిని. బ్రాహ్మణుఁడు యుద్ధము చేయలేఁడని నన్ను బాలుఁడు వెనుకకు పంపినాఁడు; ద్రోణుఁడు, కృపుఁడు; అశ్వత్థామ, బ్రాహ్మణులన్న సంగతి బాలచంద్రుఁడు మఱచెను. పరశురాముఁడు బ్రాహ్మణుఁడని బాలచంద్రుఁడు ఎఱుఁగఁడా!" అని రోషపడెను.

వీరవిక్రమయుద్ధవిభవంబు గనఁగ
భాగ్యంబులేదాయెఁ బాపిని నేను
... ... ...
జన్మమెత్తితిఁగాని సఫలంబుగాదు
సఫలంబుగాని యీ జన్మంబదేల
తనవారి రక్షింపఁ దరివచ్చినపుడు
వినిమోగపడనట్టి వీరరక్తంబు
రక్తమే? కలుష నీరంబగుఁగాక
యుప్పొంగుచున్నది యుజ్జ్వలశక్తి
యణఁగదు నేనెంత యణఁచిననైన
దహియించుచున్నది దావాగ్నిరీతిఁ
బ్రాణంబులిఁక నేనుబట్టఁగఁజాలఁ
దివిరివ్యర్థంబైన దేహంబువిడుతు
స్వర్గలోకమునందు బాలునిరాక
కెదురుచూచుచునుందు నెంతయువేడ్కఁ
బుణ్యనివాసంబు పొందియుండెదను

అని అనపోతు చింతచేయుచుండఁగా ఆమార్గమున మాడచిపోవుచుండెను. వీరమేడపిలో రాణివాసము కాచుచుండినస్త్రీ

యీమె. ఇప్పు డీమె వీరులఁగలియ కారెంపూడికి పోవుచున్నది. ఆమెను అనపోతు పిలిచినాఁడు. నమస్కరించినాఁడు; బ్రాహ్మణుఁడు మాకు నమస్కరింపరాదు, నీ కోరిక యేమి చెప్పుమన్నది. "నేనుస్వర్గలోకమునకు పోవుచున్నాను; అన్నా నిన్ను అక్కడ కలిసికొందును; నీకు నా ఆత్మహత్యా కలని పాపము అంటదు." "ఈ మాటలు నామాటలుగా బాలునికి చెప్పుము" అని అన్నాఁడు; నా జంధెము, నా కాలిబిరుదు తీసికొనిపోయి బాలచంద్రునికి ఇయ్యవలసినదన్నాఁడు; గొడుగువారిని, అడపమువారిని, దగ్గఱకు రమ్మన్నాఁడు; చెప్పవలసిన మాటలు చెప్పినాఁడు; "నెత్తురు చూచి భయపడెదరు. పాపమని నన్ను అంగఁబట్టవద్దు. మీరు దూరముగా పోవలసినది" అని చెప్పినాఁడు; తలగోసికొని ధర మీఁద వ్రాలెను. ధరమీఁదపడ్డ ఆ తల నవ్వినదఁట. "ఎట్టు వంటి భావంబో యీశ్వరుఁడెఱుఁగు."

గొడుగువారును అడపమువారునుపోయి ఈవృత్తాంతము అనపోతుతలిదండ్రులకుచెప్పిరి. తండ్రి ఒడ్డెమల్లుపురాజు. తల్లి పేరమ్మ. ఇద్దఱును వచ్చిరి. బంధువులు వచ్చిరి. విలపించిరి.

## సహగమనము

భర్తతో స్వర్గలోకమునకు పోవుటకు అనపోతుభార్య నిశ్చయించుకొనెను. చందనపు మ్రాఁకులతో కాష్ఠము పేర్చిరి. భార్యాభర్తల కిద్దఱికిని దహన సంస్కారము చేసిరి.

## మాడచి కారెంపూడిలో బాలచంద్రునికి జంధెము, బిరుదు ఇచ్చుట.

కారెంపూడికి మాడచిపోయినది. అందరును విందులు భుజించుచుండిరి. మేడపినుండి తెచ్చిన ప్రియవస్తువులన్ని బాలచంద్రునికిచ్చి, అన్నిటికంటెను ప్రియములైనవి ఇవిగో నని,

నెత్తుట తడిసిన జందెమును బిరుదును మూడచి సమర్పించెను. దానిని చూచినతోడనే బాలచంద్రుఁడు బొబ్బరించెను. సంధి చేసికొన్నను, ఇరుపక్షములవారిని హతముచేసెదనని నరసింహ భూపతితలను నరకితీరెదనని బాలచంద్రుఁడు భయంకరముగా పలికెను. అన్నముతోకూడా విస్తళ్లను వీరులు గంగధారలు నైచిరి. సంధికి వచ్చినవారిఆశలు అడుగంటినవి. వారు తిరిగి నలగామరాజువద్దకు పోయి జరిగినదంతా వినిపించిరి. యుద్ధము తప్పదనిరి. బాలచంద్రునియందు రణలక్ష్మి ఆవేశించినది. ఎవరు చెప్పిననూ వినఁడు. యుద్ధము మానవలసినదని వీరు లందరును బ్రతిమాలుకొనిరి. కాని అతని ఆవేశముతగ్గలేదు. తమ్ములనందరిని దగ్గరకు పిలిచెను. వీరులనుచూచి "నేను చిన్నవాఁడనని అనుకొనవద్దు. ప్రహ్లాదుఁడు చిన్నవాఁడు కాఁడా? సిరియాళుఁడు చిన్నవాఁడుకాఁడా? అంగదుఁడు చిన్న వాఁడుకాఁడా? కుశుఁడు చిన్నవాఁడుకాఁడా? అభిమన్యుఁడు చిన్న వాఁడుకాఁడా? వీరందఱును వీరావతారముల"ని తెలిసికొనండి. ఈనాటికిపల్నాటిసీమలో బాలచంద్రుఁడుగా అవతరించితిని. నన్ను బాలుఁడని తలఁచవద్దు.

పేరెబాలుఁడుగాని బిరుదుమగండఁ
బగవారిగొట్టని బ్రతుకదియేల?
తలిదండ్రులనుఁబ్రోవఁ దనయుఁడెకర్త
మానాభిమానముల్ మగటిమిమించఁ
బ్రబలింపఁ గలవారు బాలురె సుమ్ము
బాలురె పెద్దలు బల్లిదుల్ వారె
బాలురకేవృద్ధి పరికించిచూడఁ
బెద్దలుమతిచెడి పిఱికిపాఱుదురు

పాంచభౌతిక దేహ పటిమక్షీణించు
మనసుచలించును మాటిమాటికిని
ధైర్యంబుతగ్గు నుత్సాహంబులుడుగు
వయసుమీఱిన వేళ వచ్చునాబలిమి
కీర్తికైనను నపకీర్తికైనను
బాలురపైనుండు భారమంతయును
మైలమకామని మడియంగఁజేసి
నాయకురాలిని నయహీనఁజేసి
పరదళంబులఁజంపి పంతంబునిల్పఁ
బడుదునురణభూమిఁ బవరంబుచేసి
చూచియాస్వర్గంబు చూఱలుగొందు

అని బాలుఁడు పలికెను. బ్రహ్మనాయుఁడు యుద్ధరంగమును వర్ణించిబాలుని భయపెట్టెను; అర్జునుఁడంతటివాఁడు కర్ణునిరాకడ చూచి రథమును మరల్పుమన్నాఁడు, పసివాఁడవు, పంతములు వద్దన్నాఁడు. కాని బాలుఁడు జంకలేదు. "కొండలు బ్రద్దలు చేసెడు పిడుగు చిన్నది. నోరంతామంటించు మిరియముచిన్నది. శత్రువులు అనే అడవిని కాల్చివేయఁగల నేను చిన్నవాఁడను. చిన్నవాఁడనని నన్ను నిరుత్సాహపఱచవద్దు" అని బాలుఁడన్నాడు. బాలుఁడు యుద్ధమునకుఁబోవుటకు బ్రహ్మనాయుఁడు ఒప్పుకొనెను.

నాయనా! నా పేరు చెడఁగొట్టవద్దు, శౌర్యమును మొక్కపోనియ్యవద్దు, యుద్ధముచేసి మనపేరు నిలవబెట్టుమోయి, అని బాలచంద్రుని బ్రహ్మనాయుఁడు ఉత్సాహపఱచెను.

యుద్ధరంగము

"శౌర్యంబునకుఁ బాదు స్వర్గంపుఁద్రోవ
యిహపరసౌఖ్యాల కిదిపట్టుగొమ్మ
యిదిముక్తిసోపాన మిదిమూలధనము
(ఆగర్భశూరుల కాటప్రదేశ)
మిది దేవవితతుల నెన్న నామేలు
హెచ్చైనవీరుల కిదిపుట్టినిల్లు
(ధర్మసంరక్షణార్థంబయిబుధులు
కదలకరక్తంబు కార్చెడుచోటు)
పటుకీర్తినొందించు బ్రహ్మాండమందు
నిదిసమరావని యిదిపుణ్యభూమి
శ్రీకంఠు శిరసంటి చెప్పెదనీకు"

అని బాలునికి తండ్రి బోధించెను. ఇఁక యుద్ధమునకు పోవలసి నది అని కర్పూరతాంబూలమును శంఖతీర్థమును ఇచ్చి కుమారుని నాయఁడు దీవించెను. దండప్రణామముచేసి బాలుఁడు యుద్ధమునకుఁ బయలు దేరుచున్నాఁడు. రణభేరులు మ్రోగినవి.

నలగామరాజు తమ్ముఁడు నరసింహభూపతి యేనుఁగుపై నెక్కి యుద్ధరంగమునకు వచ్చెను. బల్లెములవారు, చొక్కచున్నలవారు, సూరెలవారు వెంటవచ్చిరి. ఏనుఁగులు, గుఱ్ఱములు వచ్చినవి. శూలములుపట్టినవీరులు వచ్చిరి. ధ్వజములు, పడిగెలు, బిరుదుగొడుగులు, పెద్దటెక్కెములు కదలివచ్చినవి. బాలచంద్రుఁడు నరసింహభూపతి సైన్యమును చాపకట్టుగా కూల్చెను. మిగిలిన సైన్యము కలఁతనొందెను.

"చచ్చినగజముల చాటునఁ దాగి
పందతనంబునఁ బడియుండువారు
పెండ్లాలఁదలఁచుక బిట్టేడ్చువారు
వస్త్రికములమీఁద వసియించువారు
గడ్డిలోఁ జొరఁబడి కదలనివారు
వ్రేళ్లుచీకెడువారు వెన్నిచ్చువారు
(వెంట్రుకల్ విప్పుక విదిలించువారు
నీవారమనిపల్కి నిల్చుండువారు
నాయుధాల్ పడవైచి యలికెడువారు
పడలేక చతికిలఁ బడియుండువారు)
బవరంబులోఁ గూలి ప్రాణజాలంబు
విడిచియుఖడ్గముల్ విడువనివారు"

నలగామరాజు సైన్యములో కొంత యీతీరుగా ఉండెను. కొందరు పారిపోవుచుండిరి. పారిపోవుచున్న సైన్యమునకు, నరసింహ భూపతి యీక్రిందివిధమున ధైర్యవాక్యములు చెప్పెను.

"విఱిగిపోవుటయిట్లు వీరధర్మంబె
బాలురఁగనుఁగొని పరువిడనేల
మిమ్ముఁగాచినవారి మేలెత్యజింపఁ
బలిమి మీనరములఁ బారురక్తంబు
రాజాన్న వర్ధితరక్తంబుగాదె
ధూర్తులై నృపులకు ద్రోహంబొనర్చి
నమ్మినరాజును నట్టేటముంచి
పోవుటయేనీతి? పుణ్యాత్ములార

తినువులస్థిరములు ధనములుకల్ల
కీర్తియొకటిటి భువి ఖిలముగాకుండు
ధైర్యహీనత వీరధర్మంబుమాని
భంగురంబై మలభాండమైనట్టి
దేహంబుకొఱకు సత్కీర్తిపోనాడి
విఱిగిపోయెడునట్టి వెఱ్ఱులుగలరె
క్షితిలోన శ్రీవీరసింహంబులకును
సమరరంగంబులే సంచారవనులు
చచ్చినబ్రతికిన సౌఖ్యమచ్చటనె
బుద్ధులుచెడిపాఱిపోవుదు రేని
భుక్తిముక్తులు రెండుపోవును దొలఁగి
నుబాసిపోవుట న్యాయంబుగాదు
తప్పునామరణంబు తలచెడిపాఱ
మృత్యుదేవతవచ్చి మేనులనిల్పె
బంటు పంతంబులే పాఱిపోవుటలు
పరికింపఁబెండ్లికి వచ్చుటలేదు
సమరకార్యమునకై చనుదెంచినాము
వచ్చినకార్యంబు వఱదలోఁగలిపి
బంధులు మిత్రులు పగవారునవ్వఁ
బోవుటహీనత పుట్టదన్నంబు
పోవద్దు రాజాన పోయితిరేని"

పాఱిపోవుచున్న నలగామరాజు సైన్యము నరసింహభూపతి మాటలు విని తిరిగి యుద్ధరంగమున విజృంభించినది. బాలచంద్రుఁడు ఈ సైన్యమునుకూడా నరికెను. తెల్లయేనుఁగుపైన

ఎక్కి ఒకఁడు నిర్భయముగా బాలునిమీఁదికిపోయెను. బాలుఁడు ఏనుఁగుతలను నరకెను; కొండవలె ఏనుఁగు భూమిపైపడెను. ఏనుఁగుపైనున్న వానిని నరసింహభూపతి అనుకొని, బాలుఁడు, తల తెగకోసెను; కోసి, ఆతలను తండ్రిదగ్గఱకు తీసికొనిపోయెను. ఇది నరసింహభూపతితలకాదు, వెంకుతల అని నాయకులూ, బ్రహ్మనాయఁడూ అనిరి. బాలునికి రోషము హెచ్చినది. వీరులకు మ్రొక్కి యుద్ధరంగమునకు వచ్చెను. ఇరుపక్షములవారును ఘోరయుద్ధముచేసిరి. ఇరుపక్షముల సైన్యమూ చాలానశించినది. నరసింహభూపతి ఎక్కడ ఎక్కడనని బాలచంద్రుఁడు వెతకసాగెను. నలగామరాజునకు సహాయులుగావచ్చిన రాజులు బాలునిపైఁగనసిరి. బాలుఁడు కేరళవిభుని పొడిచెను; కర్ణాట రాజును చంపెను; బర్బరేశ్వరుని బాహులనతికెను; మాళవ మహీపాలుని తలత్రుంచెను, ఏనుఁగుమీఁదఉన్న నరసింహ భూపతిపైకి బాలచంద్రుఁడు తారసిల్లెను. బాలచంద్రుఁడూ, నరసింహభూపతీ, అర్జునుఁడు కర్ణుఁడు పోరాడినట్లు పోరాడిరి. చివఱకు బాలచంద్రుఁడు నరసింహభూపతి రొమ్మున సామంత రాగోలతో పొడిచెను. నరసింహభూపతి మాచెర్ల చెన్నుని మదిలోనఁ దలఁచెను, అనుగురాజును ఆత్మలోనెంచెను, శీలమ నాయుని చింతించి పొగడెను, బ్రహ్మరంధ్రమున ప్రాణములు విడిచెను. చచ్చిన నరసింహభూపతినిచూచి బాలచంద్రుఁడు దుఃఖపడ్డాఁడు. చుట్టూతిరిగి,

"అనుగుభూవరపుత్ర యంగజగాత్ర
యుర్వీశతనయ యయోధ్యనివాస
మానదుర్యోధన మైలమ్మసుతుఁడ
యోతండ్రి నరసింహ యోరాజవిభుఁడ

అపరాధిఁగాను నేనపకారిఁగాను
బాపమించుక లేదు పట్టపురాజ
మిమ్ముఁగట్టఁగఁ ద్రాళ్లు మీరె తెచ్చితిరి
మీపాలిమృత్యువు మెలఁతనాగమ్మ
యలరాజుఁ జంపిన నాపగదీర్పఁ
బట్టి చంపితిఁగాని పాపంబెఱుంగ"
అని బాలుఁడు కన్నీరు కార్చెను.

నరసింహునితలకోసి ఒకచేత పట్టుకొనెను; ఒకచేత పేగులు ఎత్తుకొనెను; సామంతరాగోల చంకనబెట్టెను; తండ్రివద్దకు బయలుదేరెను. బ్రహ్మనాయఁడు చూచి, ఎదురుగాపోయి వినయముతో తలనుతీసికొనెను. బంగారుపీఁటమీద బంగారు పచ్చడముకప్పి గంధము, కస్తూరి చల్లిరి. దానిపై తలనుపెట్టిరి. బ్రహ్మనాయఁడు, వీరులు, అందరూ తలకు మ్రొక్కిరి. బ్రహ్మనాయఁడు తలనుజూచి దుఃఖించెను. బ్రహ్మనాయనిఅన్న బాదరాజు, నరసింహభూపతి తలను పట్టుకొని కన్నీరు గడ్డాన జారవడ్చెను. కొమ్మరాజు విలపించెను. సుంకరులు నగచిరి. గండువారు దుఃఖించిరి. కమ్మవారు చింతపడిరి. "నిన్ను రాజు పిలవలేదు. వచ్చినవాఁడవు వచ్చినట్లుండక, సైన్యమంతా చూఱగొంటివి, నరసింహభూపతిని చంపితివి" అని బ్రహ్మనాయఁడు కుమారుని దూషించెను. బాలచంద్రునికి ఎక్కడలేని కోపము వచ్చినది. "కొమ్మరాజు కొడుకును అలరాజును శత్రువులు చంపినప్పుడు ఇదుగోనీపగతీర్చును అని నన్ను కొమ్మరాజుకు ఒప్పగించితివి. అందుకై నేను యుద్ధముచేసితిని" అని బాలుఁడు పలికెను. బ్రహ్మనాయఁడుచేసిన చెడ్డపనులను, బాలుఁడు వరుసగా వివరించెను. బ్రహ్మనాయనికి ఆమాటలు ములుకులైనవి.

"కొడుకా! నేను పగఱకు వెన్నిచ్చివచ్చెడు వీరుఁడనుగాను. నీవు వెన్నిచ్చివచ్చితివి" అని బ్రహ్మనాయఁడు బాలచంద్రునితో అనెను. ఈమాటలు బాలచంద్రునికి బాణములైనవి. పట్టరాని కోపముతో యుద్ధరంగమునకు బాలుఁడు పోయెను. కామాక్షినితలఁచి కమ్మరకాచన్న ప్రాణములువదలెను. పాతాళగంగను ప్రార్థించి, చాకలచందన్న యుద్ధరంగమునకూలెను. మాచెర్ల చెన్నుని మదిలోన తలఁచి వెలమదోర్నీడు కలని కొరిగెను బాలచంద్రుని తక్కిన తమ్ములు కలనికి ఒరగిరి. బాలుఁడు రోషముపట్టలేక చేత వ్రేలాడు ప్రేవులు *గంగధారలో కలిపి కలనికివచ్చెను; తమ్ములనుచూచి కన్నీరువిడిచెను; శత్రుసైన్యమును చేతనైనంతమట్టుకు తుత్తునియలుచేసెను; చివరకు అలుగులమీద బాలచంద్రుఁడు వ్రాలెను. శత్రువులు అతనిని గ్రుచ్చిపట్టి యెత్తిరి. పల్నాటి బాలచంద్రుఁడు తమ్ములదగ్గరకు పోయెను; వీరస్వర్గముచేరెను. ప్రొద్దుగ్రుంకినది. చీఁకట్లు క్రమ్మినవి. యుద్ధరంగము భయంకరముగా ఉన్నది.


అని శ్రీమదక్కిరాజు లక్ష్మీనారాయణపుత్రి......ఉమాకాన్త విద్యాశేఖర ప్రణీతమైన పల్నాటివీరుల కథలలో బాలచంద్రయుద్ధము సమాప్తము.

# కొమ్మరాజు యుద్ధము

బాలచంద్రుఁడు తమ్ములు కలనిలో ఒరిగిరి. పెద్దన్న అను నామాంతరము గల బాదరాజు బాలచంద్రాదుల మరణ

---

*నాపలేటిలో కొంతభాగమునకు కారెంపూడియందు గంగధార అని పేరు.



బాలచంద్రుని కలనిపాటు.

వార్త విన్నాఁడు. ఆవేశము అధికమయినది. శత్రురాజు దళ మును సంహరింప బయలుదేరెను. బాదరాజు గుఱ్ఱముపేరు కారుబొల్లఁడు. కారుబొల్లనినెక్కి కలనికిపోయెను. శత్రుసైన్య మును కొంతనాశముచేసి పెద్దన్న రణరంగమున ప్రాణములు విడిచెను. కొమ్మరాజు మలిదేవరాజునకు మఱఁది. అలరాజు నాయకురాలి మాయచే హతుఁడైన నాటినుండి కొమ్మరాజు సౌర్యాగ్ని రాజుచుండెను. బాదరాజు మరణవార్త వినవచ్చి నది. రాజుకు చెప్పలేదు. బ్రహ్మన్నకు చెప్పలేదు. ఒక్క శత్రుసంహారముమాత్రమే అతని కన్నులయెదుట ఉండెను. ఖడ్గమును చేతబట్టి కలనికి వెడలెను.

ఈ సమయమున బ్రహ్మన్న నవ్వెను. సుంకరకన్నమ ఆ నవ్వును అర్థముచేసికొనలేక ఎందుకు నవ్వితిరని అడిగెను. మఱేమీ కారణములేదు; కొమ్మరాజు యుద్ధమునకు పోవు చున్నాడు; ఇదుగో యిప్పుడే మరలి రాఁగలఁడు; అందుకే నవ్వితినని బ్రహ్మన్న చెప్పెను.

కొమ్మరాజు శత్రుసైన్యమునకు చెలియలికట్టయై నిలు చున్నాఁడు. కాని ఒక్క నిమిషములో అతని కన్నులు మస కలు గ్రమ్మిపోయెను. అంధకారము వ్యాపించినట్లున్నది. పర దళములు కానరావు. ఓహో! తప్పివచ్చినది అని వెంటనే బ్రహ్మన్నవద్దకుపోయి జరిగిన వృత్తాంతము విన్నవించెను. కన్నమనీఁడు అద్భుతపడుచుండెను. బ్రహ్మనాయఁడు శంఖ తీర్థమిచ్చి కన్నుల తుడిచెను. కొమ్మరాజునకు కన్నులు తేట పడెను కౌస్తుభము. శంఖచక్రములు, చతుర్భుజములు బ్రహ్మనయందు విలసిల్లుచుండెను. కొమ్మరాజు బ్రహ్మన్న పాద ములపైఁబడి, స్వామీ! పుణ్యపురుషా! శ్రీహరీ! వెర్రినై నీ

సెలవుతీసికొనక యుద్ధమునకు పోయితిని; సెలవిచ్చి నన్ను కలనికి పంపుడీ! నా హృదయమున శౌర్యాగ్ని ప్రజ్వరిల్లు చున్నది; ఎంత అణచుకొన్నను ఆగదు; సెలవుకోసము వేచియున్నాను అని కొమ్మరాజు పలికెను. "కొమ్మరాజా! మలిదేవరాజు కలనికిపోవుచు మీకు పట్టముకట్టించెను. నేనే మీకు పట్టముకట్టితిని. రాజు తరువాత రాజంతటివారు మీరు. ఉభయులకు నేను మంత్రిని. మీరు నాకు సెలవీయ వలెనుగాని నేను మీకు సెలవీయ సమర్థుడనుగాను" అని బ్రహ్మనాయుడు వినయముతో చెప్పెను. బ్రహ్మన్నా! అలరాజు పగ తీర్చుకొనుటకు నీవెందఱికో సెలవిచ్చితివి; మన్నీలు, వీరులు మడిసిరి; బాలచంద్రుడు కలనికొరిగెను. బాదరాజు ఆజిలో హతుడాయెను. నా వంతువచ్చినది, నేనిక ఆగజాలను; నా ధర్మము నాకు రణరంగమును చేయెత్తి చూపుచున్నది, సెలవిచ్చి పంపవలసినది స్వామీ అని కొమ్మరాజు పలికెను. స్వామీ! నీవే మంత్రివి, నీవే రాజవు, నీవే దేవదేవుడవు ద్వాపరమున కృష్ణుడవై గుత్తికొండప్రాంతముల ఆవులమేపుచు బిలము చొచ్చితివి; హరుడు, ప్రమథులు అచ్చట ఉండిరి, కృష్ణా! కలియుగమ్మున కొంత కార్యమ్ముగలదు, ఈ ప్రమథులందఱు వీరులై జన్మింతురు, వారిని నీకు ఇల్లడచేయుచున్నానని హరుడు చెప్పెను; ప్రమథులే ఈ అరవైయారుగురు వీరులైపుట్టిరి. హరుడు మలిదేవరాజాయెను; వీరులను నీకప్పగించి మలిదేవరాజు యుద్ధమునకు పోయియున్నాడు; నీవు పరమాత్ముడవు. కృష్ణావతారమున ఆచరించిన జారత్వదోషమును పోగొట్టుకొనుటకు, కలియుగమున బ్రహ్మనాయుడవైతివి, "పరనారీ సహోదర" అని ప్రసిద్ధుడవైతివి, ఏకపత్నీవ్రతస్థుడవైతివి, పరశురా

ముని అంశము నీయందుండుటవలన రామరాఘున అని పేరు పొందితివి. ఆరణగండ్ల యుద్ధమున నిన్ను మెచ్చి దేవతలు "పిన్నన్న" అని ఎరుసచేసి పిలిచినందున పిన్నన్న అని లోక ముల ప్రఖ్యాతిపడసితివి" అని కొమ్మరాజు బ్రహ్మనాయని మహిమను కొనియాడెను.

బ్రహ్మన్నకు అనుగ్రహము కలిగెను. కొమ్మరాజునకు ముద్రలు వేసినాఁడు, తిరుమణి, తిరుచూర్ణము, కొమ్మరాజునకు అలంకరించెను, తిరుమంత్రము ఉపదేశించెను. కొమ్మరాజా! ఇఁక కలనికిపో, నీ పాలిదళములను నీవు ఖండించి కలని కొరు గుము;

"యుగములు జగములు నున్నంతవరకు
పల్నాటివీరుల పావనచరిత
వెలయుచుండునుగాక పృథ్వీశచంద్ర!"

కొమ్మరాజా! వినవలసినది. మీ కులదేవతను వజ్రాంగిని హం కాళదేవి ఇచ్చట దించిపోవలసినది అని బ్రహ్మన్న పలికెను. సర్వేశ్వరుఁడా నీకేది సమ్మతమో అదేమాకు సమ్మతమని కొమ్మ రాజు తన తోడునీడయైన హంకాళదేవిని భూమికిదింపి "దేవీ! నేను కలని కొరగఁబోవుచున్నాను, ఇఁక బ్రహ్మనాయఁడెట్లు నడపిన అట్లు నడవవలసినది" అని దేవిని బ్రహ్మనాయని కప్ప గించెను.

హంకాళదేవి నిష్ఠురాలాపములు

"శీలమురఘురామ చెప్పెద వినుము
మావారు కల్యాణమందుననుండి
ఘనరాజ్య సంపదల్ కడకుఁ బోఁదోలి
పాలుపొంద నీవిష్ణు ప్రోలికందలము

లోనయివస్తిమి లోకంబులెఱుఁగ
నీవుపెట్టిన చిక్కు నీవెఱుంగుదువు
అందఱమాయచే హతముచేసియును
పరగనీవిటువంటి పని యూహచేసి
నన్నేడబాపుట న్యాయమా నీకు
ఏమని వినిపింతు నేమందు నేను
ఏమని శోకింతు ఏమని వగతు
రాజులయ్యలతోడ రణభూమియందు
కాంక్షించి నేనును కలనికోరుగంగ
ప్రాప్తిలేదాయెను బ్రహ్మనాయుండ
నినునమ్మినందుకు నీవు మామీద
దయవుంచవైతివి దానవారాతి
భుక్తిముక్తులకు భువనేశనీవు
కర్తవన్నిటికిని గానఁజెప్పితిని"

అని బ్రహ్మనాయని యెదుట హంకాళదేవి పలికెను. అయ్యాలందఱు ఆందోళపడిరి. దేవీ! నీవు చింతింపవలదు, నీకు భుక్తిముక్తులు కల్పింతును. రణరంగమును కాచుచున్న శక్తులలో నీకు ముందుగా భుక్తిపెట్టింతును, నిన్ను ఘనముగా చూతును, మామూర్తి యెన్నాళ్లు మహిమీదనుండునో, అన్నాళ్లు నీవు మాలో పూజ్యవుగా ఉందువు, నిన్ను, పోతురాజును, గురిజాల గంగను ఒక్క పీఠమున ఉంచి మమ్ముగొలిచే మనుజులచేత మిమ్మును కొలిపింతును అని బ్రహ్మనాయఁడు హంకాళదేవిని ఓదార్చెను. దేవి సంతోషించి బ్రహ్మనాయని అనువర్తించుచు కారెంపూడి యుద్ధరంగమున ఉండెను.

### యుద్ధరంగము

ధారెలు, బూరలు, తమ్మటాలధ్వనులు చెలరేగుచుండఁగా కొమ్మరాజు రణభూమికిపోయి నిల్చుండెను. అతని ఆకారమును చూచి కాముని దళములు కలఁతచెందినవి, నాయకురాలి వద్దకు పరుగెత్తి ఓ నాగసానమ్మా కాలుఁడో, కాలభైరవుఁడో, వీరభద్రుఁడో, మనమీాదికి వచ్చియున్నాఁడని చెప్పిరి. ఆమె వారి పిఱికితనమును నిందించి, వారికి చలము పుట్టించుచుండెను. కొమ్మరాజు భట్టునుపిలిచి నలగామునివద్దకు రాయబారము పంపెను. రాఘవభట్టు నలగామునివద్దకుపోయి

### రాయబారము

"మానదుర్యోధన మైలమ్మ సుతుఁడ!
కరికాళచోళభూ కాంత చంద్రునకు
ముద్దులమనుమఁడై మొనసినవాఁడ!
వీరసోమసుతుండు విమత సంహారుఁడు
కొమ్మభూపాలుఁడు కులశేఖరుండు
నెఱివచ్చి రణభూమి నిల్చియున్నాఁడు
ఆయనపుత్రుని అలరాజునపుడు
మంత్రతంత్రముల మడియించినావు"

నలగామరాజా! అలరాజుపగకై అయ్యాలందఱును అలరాజుతో హతమాదుమని శపథముచేసియున్నారు. అధర్మమును సంహరించి, అటుపిమ్మట కలనికోరుగుదమని వీరులు సన్నద్ధులై యున్నారు. కలనికి విచ్చేయవలసినదని చెప్పిపంపినాఁడు కొమ్మరాజు అని రాఘవభట్టు నలగామునికి విన్నవించెను. నలగాముఁడు భట్టుకు వస్త్రములిచ్చిపంపి నాయకురాలితో ఈ సంగతి

చెప్పెను. ఈ వీరులా! వీరులనెంత! అని నిర్భయముగా నాయకురాలు పలికి రాజాజ్ఞ తీసికొనిపోయి సేనలను పరామర్శించెను. విలువిద్యయందు నేర్పరియైన జోదులసోముని కొమ్మరాజు నెదిరించుటకు నిశ్చయించెను. ద్రోణునివలె జోదుల సోము విలువిద్యకు ఆచార్యుఁడు. జోదుల సోమ శేఖరుని నాయకురాలు కొనియాడెను, అతని చాపవిద్యానైపుణ్యమును స్తుతించెను, అతని శౌర్యాగ్నిని ప్రజ్వరిల్లఁజేసెను. తొమ్మిదివేల కాల్బలములు, పన్నెండువేల గుఱ్ఱములు, వేయి యేనుగులు, లక్షమంది యీటెలవారు కదలి వెంటరాఁగా జోదుల సోమశేఖరుఁడు కొమ్మరాజు నెదుర్చుటకు బయలుదేఱెను. కొమ్మరాజు సోముని సైన్యమును భగ్నముచేసెను; గుఱ్ఱములను నఱకెను, ఏనుఁగులను దునుమాడెను, బాకులవారి ప్రాణములను తల్లడిల్లఁజేసెను కాని శత్రుసైన్యములు సముద్రతరంగములవలె వచ్చుచున్నవి. కొమ్మరాజు తమ్ములు నలుగురున్నారు. వారు ముందుకువచ్చి అన్నా! మాకు సెలవీయవలసినది, మా హృదయముల అగ్ని మండుచున్నది, మా ధర్మమును నెఱవేర్ప నీయవలసినది అని పలికిరి. తమ్ములారా! మనతో పోరాడఁగల మహీపతులు లేరు, అలరాజు పగకై అరవైమూడుగురు వీరులు, మన శత్రువులను సంహరించి వారి వెనువెంటనే పోవలసిన వంతమున్నది. కనుక మీమీ పాలిదళములను మీరుగూల్చి కలినికొరగండి అని కొమ్మరాజు తమ్ములకు విడియములిచ్చెను. కొమ్మరాజు తమ్ములు శరపరంపరలు కాముని సేనలమీద గురిపించిరి. బాణాహతిచే బలమెల్ల పడుచుండెను. సోమశేఖరుఁడిదిచూచి ఆవేశముచెందెను. తన తమ్ములనుబిలిచి “ఓ శూరులారా! కొమ్మరాజు తమ్ములు మన సేనలను చీకాకు

పలుచుచున్నారు, మీరు దురములో వారిని దునుమాడవలసినది" అని పలికెను. కొమ్మరాజు తమ్ములు, కాముని సేనలను వదలి సోమశేఖరుని తమ్ములపై బాణములు వేసిరి. ఇరుపక్షములకును ద్వంద్వయుద్ధము జరిగినది. చివరకు కొమ్మరాజు తమ్ములు ప్రయోగించిన అర్ధచంద్రబాణముచేత సోమశేఖరుని తమ్ముల శిరస్సులు నేలపై బడినవి. సోమశేఖరుడు ఘూర్ణిల్లి యుద్ధమునకు పూనుకొనెను. సేనలను పురికొల్పెను. రెండుపక్షముల సేనకు దొమ్మియుద్ధము జరిగినది. తమ్ములు కొమ్మరాజువద్దకుపోయి అన్నా మాపాలి దళముల ఖండించితిమి, మమ్మును జంపే మానవాధీశ్వరులు లేరు. మేము కలనిలో ఒరగువిధమేమి అని అడిగిరి. మీవద్దనున్నవన్నీ దివ్యాస్త్రములు; మీవద్ద అలరాజు సూర్యఖేతాళమున్నది; దానిని ఆదిత్యుడు అలరాజున కిచ్చెను. కనుక మీరు ఇతరులచేత పరాజయము పొందరు; మీరు ఈ దివ్యాస్త్రములను వదలి, కురుచక్రైదువులను పట్టుకొని వైరులమీద ఒరగండి అని కొమ్మరాజు తమ్ములకు చెప్పెను. చోళరాజు, అల్లాదిరాజు, ముప్పిడిరాజు, నూకరాజు అని కొమ్మరాజు తమ్ములపేర్లు. వీరు నలుగురు కొమ్మరాజునకు నమస్కరించి కోపుకోపున అరచి కఱచకుంతలములు కుదురుగాబట్టి సేనల మీద కుప్పించి దుమికిరి. రథములను రాపాడిరి; గజములను ఖండించిరి; గుఱ్ఱములను కూల్చిరి. సేనలను చెండాడిరి. రణరంగమంతా నెత్తుటికాల్వలతో భయంకరముగా ఉన్నది. కొమ్మరాజు తమ్ములు అలుగుల పాన్పులపై స్వయముగా ఒరిగిరి. శ్రీగిరీశుని తలంచి, చెన్నుని తలంచి, అర్వదార్వురు వీరులందఱను తలంచి, బ్రహ్మనాయుని తలంచి, కొమ్మరాజును తలంచి నల్వురు తమ్ములు ప్రాణములు విడిచిరి. కొమ్మరాజు క్రోధాగ్ని ప్రజ్వరిల్లినది.

## కొమ్మరాజు సోమశేఖరుల ద్వంద్వయుద్ధము

కొమ్మరాజు భీకరాకారముతో రణరంగమున నిల్వఁబడఁగానే సోమశేఖరుఁడు సన్నద్ధుఁడై వచ్చెను. ఏనుఁగు లేనుఁగులు, గుఱ్ఱములు గుఱ్ఱములు, శూరులు శూరులు, ఈటెలీటెలు, బండ్లు బండ్లు, విండ్లు విండ్లు, బాణములు బాణములు పెనఁగెను. కురు బలమువలె, ప్రళయమారుతమునకు వృక్షములవలె, సైన్య మెల్ల చాపకట్లుగాఁ బడెను. సోమశేఖరుఁడు గుఱ్ఱముదిగి ఏనుగుపై నెక్కెను. కొమ్మరాజా! నీవు పట్టపురాజవు, నీ శౌర్యమునకు మెచ్చితిని, నీతో సరియైన శూరులు లేరు, నాయకురాలు నన్ను నిర్ణయించెను, నన్ను నీకు గెల్వఁదరమా? అని సోముఁడు పలికెను. ఓహో అవుదువు శూరుడవగుదువు, నీవు ముఖాముఖిని యుద్ధముచేసి నన్నోడించవలసినది, నీశూరనామము సార్థకమగునని కొమ్మరాజు పలికెను. ఇద్దఱును కొంతసేపు యుద్ధముచేసిరి. సోమశేఖరుని శిరస్సు నేలపైఁ బడినది.

## నాయకురాలి పన్నుగడ

నాయకురాలు నలగామరాజుతో సోమశేఖరుని మరణము, అతని తమ్ముల మరణము తెలిపెను. ఇక ధర్మయుద్ధమున కొమ్మరాజును చంపలేము, దొమ్మిగా అతనిమీద పడుదము, మన సామంతరాజులను పిలిపించి అతనిమీదికి పంపుదము అని ఆలోచన నలగామునికి చెప్పెను. సామంతరాజులకు నలగాముఁడు ఉత్తరములు వ్రాసెను. అందఱును వచ్చిరి. నాయకురాలు వారిని గౌరవించినది, వారికి సేనలకు విడియములిచ్చినది, మీరుపోయి కొమ్మరాజును కూల్చిరావలసినది అని వారినందఱను పంపెను.

## సైన్యప్రస్థానము

సామంతరాజులు, సేనానాయకులు, శూరులు, మహా కోలాహలముతో బయలుదేరి కొమ్మరాజుమీదికి పోవుచుండిరి. కొమ్మరాజును నలగామః డధర్మయుద్ధమున చంపవచ్చుచున్నాడని భూదేవి సూర్యునికి చెప్పబోయినదో యన్నట్లుగా సైన్యఘట్టనకు లేచిన భూరజము సూర్యునివఱకు వ్యాపించెను. నేల యీనినట్లు సేనలున్నవి. కొమ్మరాజు కోయని యార్చి సేనలపై కురికెను, శత్రుసేనలను చెండాడెను. వైరి సామంతులనుచూచి "ఓ రాజులారా! అరణగండ్ల యుద్ధమున బ్రహ్మనాయఁడు బందెలదొడ్డేర్పఱచి, అందులో మిమ్ము దోలి మీవల్ల బందెలు పుచ్చుకొనెను, ఏటేట ఆ బందె యిచ్చి బ్రతుకునట్టి మీరేతీరున సిగ్గువిడిచి యుద్ధమునకు వచ్చితిరి" అని కొమ్మరాజు పలికెను. పుట్టలెక్కినవారిని, పోలేనివారిని, ఆయుధములు దింపినవారిని, గడ్డిగఱచినవారిని చంప ధర్మముగాదు గనుక కొమ్మరాజు వారిమీద సమ్మోహనాస్త్రము వేసెను. అది ఆ సైన్యమును నిద్రింపఁజేసెను. సైన్యమంతా మూర్ఛిల్లినట్లు నేలకు పడెను. కొంతసేపటికి మూర్ఛదెలిసి పులి నాకి విడిచి నట్లైనది మన గతి అని తలలు వంచుకొని దీనులైయుండిరి. కొమ్మరాజు తనలోతాను "నా పాలిదళములు నేను ఖండించి తిని, దివ్యాస్త్రబలముతో ఉన్న నన్నెవ్వరును దునుమాడలేరు, ఇక నేను కలనికి ఒరగవలసియున్నది" అని చింతించి భద్రగజము దిగెను. శస్త్రాస్త్రములు, విండ్లు పోగుగా భూమిమీద పెట్టెను.

భట్టును పిలిచి "రాఘవా! భూతకోటికి తృప్తిగా యుద్ధము చేసితిని. ఇంక నేను ఒరగవలయును, ఈ ఆయుధములన్నీ బ్రహ్మనాయనివద్దకు తీసికొనిపోయి తిరుముద్ర వేయించుము" అని కొమ్మన్న చెప్పెను. "స్వామీ! మీతోగూడా నేను కలని కొరగుటకు సెలవియ్యండి. నా మనస్సు ఉజ్జ్వలమైయున్నది" అని భట్టువేడెను. భట్టూ నీవు ఒరగినయెడల నా శౌర్యమును మహిమీద ఎవరు చాటుదురు? పసులకీ జయకీర్తనము అలవి కాదు కనుక నీవు పొమ్ము అని కొమ్మరాజు పంపెను. భట్టు సమ్మతించి దివ్యాస్త్రములను మోపుగా కట్టి బ్రహ్మనాయనివద్దకు చేర్చెను. బ్రహ్మనాయుడు ఆశస్త్రాస్త్రములను మంత్రించి ముద్రించి కొమ్మరాజు రణమును తన దివ్యదృష్టితో చూచుచుండెను. కొమ్మరాజు కుంతమును చేతబట్టుకొని శత్రుసైన్యమును చిందఱ వందఱచేసి హతముకావించెను. దేవతలు కొమ్మరాజుపై పుష్పవర్షము గురిపించిరి. రక్తదృష్టమైన కుంతమును కొమ్మ రాజు విశ్రాంతి కైకొనుమన్నాడు, వీరశయనమునొందియున్న తమ్ములవద్దకు వచ్చినాడు! తమ్ములారా! ధర్మబద్ధులై, రణరంగ మున ప్రాణములు విడిచిన కర్మవీరులారా! మీవెంట వచ్చు చున్నాను, కలియుగమునందు మీచరిత్రలు వెలయునుగాక.

ధర్మముండెడుదాక ధరయుండుదాక
సత్యముండెడుదాక శశియుండుదాక
రణముండుదాకను రవియుండుదాక
పల్నాటివీరుల పావనచరిత
నిల్చియుండునుగాక నిర్మలులార

అని పలికి అలుగులపై కొమ్మరాజు ఒరిగెను. మాచెర్లచెన్నుని, శీలము బ్రహ్మనాయని శ్రీగిరీశుని తలంచి బ్రహ్మన్న నడపిన విధమున నడవవలసినదని తల్లికిచెప్పి కొమ్మరాజు ప్రాణములు విడిచెను. హంకాళదేవి, బ్రహ్మనాయఁడు, శ్రీకార్యమపూడి రణరంగమును వీక్షించుచుండిరి.

అని శ్రీమదక్కిరాజు లక్ష్మీనారాయణపుత్ర......ఉమాకాన్తవిద్యాశేఖర ప్రణీతమైన పల్నాటివీరుల కథలలో కొమ్మరాజు యుద్ధము ముగిసినది. ఈ పుస్తకము సయితము ముగిసినది.

PRINTED AT THE MADRAS DIOCESAN PRESS.—A. 15164.

# మాక్మిలన్ కంపెనీవారి స్వదేశభాషా పుస్తకములు.

## తెలుగున క్రొత్తగా ప్రకటించినవి

## ప్రాగ్దేశపు కథలు.

| | | అ. | పై. |
|---|---|---|---|
| మొదటి శ్రేణు. రెండవ, మూడవ తరగతులకు. | | | |
| 1. హితోపదేశ కథలు. ప్రథమభాగము | ... ... | 2 | 6 |
| 2. ,, ద్వితీయభాగము | ... ... | 2 | 6 |
| 3 గుల్జార్-ఇ-దబిస్తాన్ నుండి గ్రహింపబడిన చిన్న కథలు. | | 2 | 6 |
| రెండవ శ్రేణు. మూడవ, నాల్గవ తరగతులకు | | | |
| అన్వార్-ఇ-సుహేలీనుండి వ్రాసిన పారసీక కథలు | | | |
| 1. ,, మొదటి భాగము | ... | 3 | 0 |
| 2. ,, రెండవ భాగము | ... | 3 | 0 |
| 3. కథాసరిత్సాగరపు కథలు | ... ... ... | 3 | 0 |
| మూడవ శ్రేణి. నాల్గవ, ఐదవ తరగతులకు. | | | |
| 1. సీతారాముల జనన ప్రవాస సంచారములు | ... ... | 4 | 0 |
| 2 సీతయొక్క రెండవ ప్రవాసము | ... ... | 4 | 0 |
| 3. సాది వివేకము | .. ... ... ... | 4 | 0 |
| పిల్లలకథలు. మొదటి పుస్తకము | ... ... ... | 2 | 0 |
| ,, రెండవ ,, | ... ... ... | 4 | 6 |
| ,, మూడవ ,, (ఈసప్ కథలు) | ... ... | 3 | 0 |
| ట్రాయిపట్టణపు కథలు | ... ... ... | 2 | 0 |
| ప్రకృతి పరిశీలనా వాచకము. | | | |
| మొదటి పుస్తకము. నాల్గవ తరగతికి | ... ... | 5 | 0 |
| రెండవ , ఐదవ ,, | ... ... | 8 | 0 |
| కాంబరాన్ మారిసన్ ఎం. ఏ యల్. యస్. బి., గారు దక్షిణ ఇండియా పాఠశాలల ఉపయోగార్థము వ్రాసిన ప్రారంభ భూగోళ పుస్తకములు | | | |
| మానవ్య వాసస్థానము 4-వ తరగతికి | ... ... | 8 | 0 |
| మన నివాసస్థలము (మద్రాసు రాజ్యభాగము) | ... | 10 | 0 |
| కే.ఏ. వీరరాఘవాచార్యులు వ్రాసిన భూగోళ వాచక పుస్తకములు. | | | |
| 4-వతరగతికి ఉపయోగమైన ఆంధ్ర మండలములోని ప్రతిజిల్లా | | 4 | 6 |
| చెన్నరాజధాని భూగోళశాస్త్రము | ... ... ... | 6 | 0 |